శుక్రవారం
17-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 264
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రేపటి నుంచి భారీ వర్షాలు

ఎండలు మండితున్న వేళ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. వరుసనగా నాలుగు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

2లో

నవరత్న భరిత బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్ రూ.2,79,279 కోట్లు



- ఓట్ల పథకాలకే ప్రాధాన్యం
- సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రం
- రెవెన్యూ వ్యయం రూ. 2,28,540 కోట్లు
- మూల ధన వ్యయం రూ.31,061 కోట్లు
- రెవెన్యూ లోటు రూ.22,316 కోట్లు
- ద్రవ్య లోటు రూ.54,587 కోట్లుగా అంచనా
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
ఏపీ బడ్జెట్ 2023-24 వార్షిక సంవత్సరానికి గాను రూ. 2 లక్షల 79 వేల 279 కోట్లతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రవేశపెట్టారు. వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి పాతపద్ధతిని కొనసాగిస్తూ విడిగా ప్రవేశపెట్టారు. తొలుత ఈ రెండు బడ్జెట్‌లను మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. గత బడ్జెట్‌ల తరహాలోనే ఈ బడ్జెట్ కూడా ఓట్ల ఆకర్షణే లక్ష్యంగా నవరత్నాల పథకాలకే పెద్దపీట వేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు, సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రపు నిధులు విదిల్చారు. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,28,540 కోట్లుగా, మూల ధన వ్యయం అంచనా రూ.31,061కోట్లుగా, రెవిన్యూ లోటు రూ.22,316 కోట్లుగా, ద్రవ్య లోటు రూ.54,587కోట్ల అంచనాతో మంత్రి ప్రతిపాదించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవిన్యూలోటు 3.77శాతంగా, ద్రవ్యలోటు 1.54 శాతంగా ఉండవచ్చునని మంత్రి వెల్లడించారు. పోతన పద్యంతో, రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యాఖ్యలతో బుగ్గన

- మిగతా 2 లో

నీటి పారుదలకు
మొండి చేయి

అసెంబ్లీ, శాసన మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీదిరి అప్పలరాజు

2లో

- వ్యవసాయశాఖకూ మొక్కుబడి నిధులు
- రూ.41436.29 కోట్లతో వ్యవసాయ, అనుబంధ బడ్జెట్
- వ్యవసాయశాఖకు రూ.12,369 కోట్లు
- జల వనరులశాఖకు రూ.11,908.10 కోట్లు
- పశు సంవర్ధకశాఖకు రూ.111.23 కోట్లు
- మార్కెటింగ్ శాఖకు రూ.513.74 కోట్లు
- ఉద్యానవనం రూ.656.64 కోట్లు

మళ్లీ టీడీపీ సభ్యుల సస్పెన్షన్

2లో

శాసనసభ రెండో రోజూ కూడా టీడీపీ సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. 'దివాలా బడ్జెట్.. జగన్ రెడ్డి కళకళ.. ప్రజలు గిలగిల' అని బ్యానర్‌తో టీడీపీ సభ్యులు అసెంబ్లీ వెలుపల ఆందోళన చేపట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు.

హడావుడిగా హస్తినకు జగన్

- బడ్జెట్ సమావేశాల మధ్య ప్రయాణంపై సస్పెన్స్
- అకస్మాత్ నిర్ణయంపై అనుమానాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అకస్మాత్తుగా హస్తినకు పయనమవ్వడం రాష్ట్ర రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఏపీ బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈనెల 24వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. కీలక బిల్లులు, ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సి ఉంది. దీంతో సెలవు దినాలైన శని, ఆదివారాలు కూడా అసెంబ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. కీలకమైన సమయంలో సీఎం జగన్ గురువారం సాయంత్రం అకస్మాత్‌గా దిల్లీకి బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారపార్టీ వర్గాలు చెపుతున్నాయి. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేయడానికి సిద్ధంగా ఉంది.

ఈ కేసులో మరికొందరు కీలకనేతలు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క కోడికత్తి కేసులో ఏప్రిల్ 10వ తేదీ విచారణకు హాజరుకావాలని జగన్‌మోహన్ రెడ్డికి ఎన్ఐఏ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సీఎంతో పాటు పీఏ నాగేశ్వరరెడ్డి హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మోదీ, అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోసం కొద్దిరోజులుగా ఎదురు చూస్తున్న జగన్ అకస్మాత్తుగా దిల్లీ వెళ్లడంపై పార్టీ నేతల్లో పెద్దఎత్తున చర్చకు దారితీసింది.

అప్పులు ఘనం అభివృద్ధి శూన్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్రబ్యూరో- అమరావతి:
రాష్ట్ర బడ్జెట్ 'అప్పులు ఘనం- అభివృద్ధి శూన్యం'గా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. వరుసగా ఐదోసారి అబద్ధాల చిట్టాను విజయవంతంగా ప్రవేశపెట్టారని విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఆర్థికమంత్రి బుగ్గన గొప్పలు చెబుతుంటే, మరోవైపు సీఎం నవ్వులు విసరడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రామకృష్ణ ఓ ప్రకటనలో స్పందించారు. 'యేటా పేరుకే లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపులు ప్రకటిస్తున్నారు. వాస్తవానికి అందులో నాలుగో వంతు కూడా ఖర్చుపెట్టకుండా జనాన్ని మోసం చేస్తున్నారు. ఇంత భారీ బడ్జెట్ ఉన్నప్పుడు ఉద్యోగులకు ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు

ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? ఈ బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీనే. నీటి వనరుల అభివృద్ధికి కేవలం 5 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. రాష్ట్ర జీడీపీ 7 శాతం కూడా దాటలేదు. కానీ అప్పుల కోసం 14 శాతం వరకు జీడీపీ పెరిగినట్లు చూపించుకొని ఎన్నాళ్లు మోసం చేస్తారు? అప్పుల కోసం 13 లక్షల కోట్ల జీఎస్‌డీపీని చూపించుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. అమ్మఒడి, ఆసరా, కళ్యాణమస్తులను ఒక ఏడాది ఎత్తేశారు. పైగా కళ్యాణమస్తు లాంటి పథకాలు షరతుల పుణ్యమా అని ఎవరికీ వర్తించడం లేదు. పైగా సగం స్కీములు స్కాములుగానే ఉన్నాయి. బడ్జెట్ బారెడు-ఖర్చు మూరెడులా కేటాయింపులు ఉన్నాయి. రాష్ట్రాన్ని ఆర్థికంగా అధోగతిపాలు చేసిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదు' అని రామకృష్ణ హెచ్చరించారు.

దగాకోరు బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్ మొత్తం డొల్లే. మోసపూరిత, దగాకోరు బడ్జెట్‌తో జగన్ అండ్ కో మరోసారి ప్రజల్ని మోసగించడానికి సిద్ధమయ్యారు. ఆచరణలో సాధ్యంకాని గణాంకాలను బడ్జెట్లో ఆర్థికమంత్రి బుగ్గన వల్లె వేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తానన్న జగన్ ఆ హామీని విస్మరించారు.

- అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ డొల్లతనాన్ని చూపిన బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వ ఆర్థిక డొల్లతనాన్ని తెలియజేసింది. బడ్జెట్‌లో అంకెల హంగామా తప్ప మరేమీ లేదు.ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు గురించి కాకుండా ఇళ్లకు స్టిక్కర్లు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అతికించడానికి నిధులు ఇవ్వడం దారుణం. ప్రజలను మభ్యపెట్టేందుకే ఇలాంటి అంకెల గారడీ చేస్తున్నారు.

- నాదెండ్ల మనోహర్, జనసేన

నాలుగు 'ఎమ్మెల్సీ' వైసీపీకే

- ఉమ్మడి పశ్చిమలో కవురు, వంక గెలుపు
- శ్రీకాకుళం-నర్తు రామారావు, కర్నూలు-మధుసూదన్ విజయం
- ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో కొనసాగుతున్న లెక్కింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. శ్రీకాకుళం, ఉమ్మడి పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాలలోని నాలుగు స్థానాలనూ అధికార పార్టీ కైవసం చేసుకుంది. ఇప్పటికే ఐదు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు వైసీపీకి ఏకగ్రీవమయ్యాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఈనెల 13వ తేదీన రాష్ట్రంలోని మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ, నాలుగు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన డాక్టర్ అలంపురం మధుసూదన్ విజయం సాధించారు.
శ్రీకాకుళం ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని రెండు స్థానాలలో అధికార అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ గెలుపొందారు. మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయులు, నాలుగు స్థానిక సంస్థల నియోజకవర్గాలు కలుపుకుని మొత్తం ఎనిమిది ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పు గోదావరి, చిత్తూరు స్థానిక సంస్థల నియోజకవర్గ స్థానాలకు వైసీపీ అభ్యర్థులు మినహా ఎవరూ ఈ స్థానాలకు పోటీ చేయకపోవడం వల్ల అక్కడ అధికార పార్టీ అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఎస్.మంగమ్మ, కడపకు రామసుబ్బారెడ్డి, నెల్లూరుకు మేరుగ మురళీధర్, తూర్పుగోదావరికి కుడిపూడి సూర్యనారాయణరావు, చిత్తూరు స్థానిక సంస్థల నియోజక వర్గానికి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. పట్టభద్రుల నియోజకవర్గాలైన శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం-కర్నూలు నియోజకవర్గాలకు ఓట్లు లెక్కిస్తున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

ఇదీ లోకం!

ఐతే నీ అభిప్రాయం ఇదన్నమాట!

మోదీవి దృష్టిమళ్లించే కుయుక్తులు

- మిత్రుడిని కాపాడుకునే యత్నాల్లో ప్రధాని
- విపక్ష ఎంపీల విమర్శలు - పార్లమెంటు ఆవరణలో మానవహారం
- అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణకు డిమాండు

2లో

విచారణకు కవిత దూరం

- రాలేనని ఈడీకి లేఖ
- న్యాయవాదితో అధికారులకు పత్రాల అందజేత
- 20న హాజరు కావాలని మళ్లీ సమన్లు
- దిల్లీలో రోజంతా హైడ్రామా

న్యూదిల్లీ:
దిల్లీ మద్యం కేసులో తాను ఈరోజు విచారణకు హాజరు కాలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె కవిత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి గురువారం లేఖ రాశారు. విచారణకు కొన్ని గంటల ముందు ఆమె తన లేఖను అధికారులకు ఈ-మెయిల్‌లో పంపారు. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు ఉన్న కారణంగా ఈడీ ముందు హాజరు కాలేనని ఆమె పేర్కొన్నారు. మరో రోజు విచారణకు హాజరయ్యేందుకు సిద్దంగా ఉన్నట్టు తెలిపారు. ఈ నెల 11న జరిగిన విచారణలో ఈడీ అధికారులు అడిగిన పత్రాలను తన న్యాయవాది భరత్ ద్వారా కవిత పంపారు. అయితే, ఆమె విజ్ఞప్తిని ఈడీ అధికారులు మన్నించారు. మార్చి 20వ తేదీన విచారణకు రావాల్సిందిగా మరోసారి నోటీసులు పంపారు. అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలని, తనకు పంపిన సమన్లు కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో తాను పిటిషన్ దాఖలు చేశానని, ఇది విచారణలో ఉందని ఈడీకి కవిత తెలిపారు. 'మహిళలను కార్యాలయానికి పిలిచి విచారించొద్దు. ఆడియో, వీడియో విచారణకు నేను సిద్ధమే. అధికారులు నా నివాసానికి వచ్చి విచారణ చేయవచ్చు. ఈ నెల 11న జరిగిన విచారణకు పూర్తిగా సహకరించా. ఈడీ ప్రశ్నలకు నాకు తెలిసిన మేరకు సమాధానాలు చెప్పాను. ఈ నెల 11న రాత్రి 8గంటల వరకు విచారించారు. ఇవాళ మళ్లీ రావాలని 11వ తేదీన సమన్లు ఇచ్చారు. వ్యక్తిగతంగా రావాలని సమన్లలో పేర్కొనలేదు. నా ప్రతినిధిగా భరత్‌ను ఈడీ కార్యాలయానికి పంపుతున్నా. మీరు అడిగిన వివరాలు భరత్ ద్వారా

- మిగతా 2 లో

రేపు విచారణకు రావాలి
మాగుంటకు ఈడీ నోటీసు

2లో

ఉ.కొరియా ఖండాంతర క్షిపణి ప్రయోగం

సియోల్/టోక్యో: అమెరికాతో కలిసి దక్షిణ కొరియా సైనిక విన్యాశాలు చేపట్టిన క్రమంలో ఉత్తర కొరియా వరుసగా క్షిపణులు ప్రయోగిస్తోంది. ఇదే క్రమంలో గురువారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం)ను ప్యాంగ్యాంగ్ పరీక్షించింది. ఈ మేరకు సియోల్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ వెల్లడించారు. ప్యాంగ్యాంగ్‌లోని సునన్ ప్రాంతం నుంచి సుదూర లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని తమ సైన్యం గుర్తించినట్లు తెలిపింది. జపాన్ ప్రభుత్వం కూడా ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. తమ కోస్ట్‌గార్డ్ అంచనా ప్రకారం ప్రయోగించిన గంట తర్వాత అది నిర్దేశిత లక్ష్యానికి చేరినట్లు వెల్లడించింది. 70 నిమిషాలు ఆరువేల కిమీలను ఈ క్షిపణి ఛేదించిందని జపాన్ రక్షణశాఖ తెలిపింది. తమ దేశ ఆర్థిక జోన్ వెలుపల జలాల్లో క్షిపణి పడిందని జపాన్ రక్షణ మంత్రి యసుకాజు హమాదా తెలిపారు. ఓషిమాఓషిమాలో క్షిపణి పడిందన్నారు. అటు దక్షిణ కొరియా కూడా జపాన్ సముద్రంలోకి గుర్తుతెలియని బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. ఈ మేరకు దక్షిణ కొరియా సైన్యం పేర్కొన్నట్లు యోన్హప్ వార్తాసంస్థ వెల్లడించింది. దక్షిణ కొరియా-అమెరికా ఫ్రీడమ్ షీల్డ్ పేరిట జరుగుతున్న సైనిక విన్యాశాల క్రమంలో తాజా ప్రయోగం జరిగింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ టోక్యోలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిదాతో భేటీ అయ్యేందుకు కొన్ని గంటల ముందు ప్రయోగం జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మా గగనతలంలోకి రావద్దు

అమెరికాకు రష్యా హెచ్చరిక

మాస్కో: అమెరికా డ్రోన్‌ను రష్యా గగనతలంలోకి ప్రవేశించగా దానిని రష్యా పేల్చివేసింది. రష్యా జెట్ విమానాలు అమెరికా డ్రోన్‌ను పేల్చివేయగా అది నల్లసముద్రంలో పడిపోయింది. ప్రపంచంలోని రెండు అతిపెద్దశక్తుల మధ్య ఇటువంటి ఘటన ఉక్రెయిన్-రష్యా యుద్ధం క్రమంలో మొదటిసారి జరిగింది. అమెరికా డ్రోన్ తమ గగనతలంలోకి ప్రవేశించడాన్ని రష్యా తీవ్రంగా పరిగణించింది. మరోసారి ప్రవేశించొద్దని అగ్రరాజ్యాన్ని క్రెమ్లిన్ హెచ్చరించింది. వాషింగ్టన్‌తో మాస్కోకు సంబంధాలు చెడిపోయిన విషయాన్ని ప్రస్తావించింది. నల్లసముద్రంలో పడిన అమెరికా గూఢచర్య డ్రోన్ శిథిలాలను వెలికితీసేందుకు యత్నిస్తామని రష్యా భద్రతా మండలి కార్యదర్శి నికోలాయ్ పత్రుషేవ్ తెలిపారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కో స్పందిస్తూ ఈ ఘటనపై వాషింగ్టన్‌లోని అగ్రస్థాయితో ఎలాంటి సంప్రదింపులు జరగలేదన్నారు. రష్యా రక్షణ శాఖ ఇప్పటికే విడుదల చేసిన ప్రకటనకు మించి చెప్పేందుకు ఏమీ లేదని అన్నారు. అమెరికాతో బంధం దయనీయ స్థితిలో ఉందని, నిర్మాణాత్మక చర్చలను రష్యా నిరాకరించలేదని, ఇప్పుడు కూడా నిరాకరించదన్నారు. ఇదిలావుంటే రెండు రష్యన్ ఎస్‌యూ-27 యుద్ధవిమానాలు గాల్లో ఢీకొనడం వల్ల అంతర్జాతీయ జలాలపై భూ పరిశీలన కోసం వాడే తమ ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌లలో ఒకటి ధ్వంసమైందని అమెరికా సైన్యం ప్రకటించింది. సైనికులు తమ డ్రోన్‌పై ఇంధనం పోశారని, దాని ప్రోపెల్లర్‌ను చెడగొట్టారని, దాంతో అది సముద్రంలో కూలిందని వాషింగ్టన్ పేర్కొంది. మాస్కో ఆ ఆరోపణలను తోసిపుచ్చింది. అమెరికా డ్రోన్ ఉద్దేశపూర్వకంగా తమ గగనతలంలోకి వచ్చిందని, దానిని గుర్తించి ధ్వంసం చేశామని తెలిపింది. తమ దేశ సరిహద్దుకు దగ్గర్లో అమెరికా సైనిక చర్యలు ఆమోదయోగ్యం కాదని రాయబారి అంటోనోవ్ వెల్లడించారు. తమ సైనిక బలగాలను దెబ్బతీసేందుకు కీవ్ యంత్రాంగం కోసం సమాచారాన్ని కూడకట్టేందుకు ఇంటెలిజెన్స్ డ్రోన్లను వాషింగ్టన్ వినియోగిస్తోందని ఆరోపించారు.

20న నేపాల్ పార్లమెంటులో విశ్వాస ఓటు

ఖాట్మండు: నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ ప్రచండ ఈనెల 20వ తేదీన పార్లమెంటులో విశ్వాస ఓటు నిర్వహించనున్నారు. ఇటీవల అధికార కూటమి నుంచి రెండవ అతిపెద్ద పార్టీ సీపీఎన్‌యూఎంఎల్ తమ మద్దతును ఉపసంహరించుకుంది. దీంతో బలపరీక్షకు ప్రచండ సిద్ధం కావాల్సి వచ్చింది. అధ్యక్షుడి ఎన్నిక క్రమంలో మారిన రాజకీయ సమీకరణల పర్యవసానంగా అధికార కూటమికి కొన్ని మిత్రపక్షాలు వీడ్కోలు పలికాయి. ప్రచండ-మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ మధ్య పొత్తు కూడా చెడిపోయింది. నేపాలీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రామ్ చంద్ర పౌడెల్‌కు ప్రచండ మద్దతివ్వడమే ఇందుకు ప్రధాన కారణమైన విషయం విదితమే.

రేపు విచారణకు రావాలి

మాగుంటకు ఈడీ నోటీసు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని దిల్లీ మద్యం కుంభకోణం వెంటాడుతుంది. ఇప్పటికే తన తనయుడు మాగుంట రాఘవరెడ్డిని ఈడీ అరెస్ట్ చేయగా తీహార్ జైల్లో ఉన్న విషయం విదితమే. తాజాగా ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18వ తేదీన హాజరు కావాలని ఈడీ అధికారులు ఆదేశించారు. సౌత్ గ్రూపులో కీలకంగా ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ఎంపీ అయిన మాగుంట శ్రీనివాసరెడ్డిని దిల్లీ మద్యం కుంభకోణం వెంటాడటం ఆ పార్టీ వారిలో ఆందోళన రేకెత్తిస్తుంది. ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకులు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే అనేక మందిని అరెస్ట్ చేశారు. తాజాగా మాగుంట శ్రీనివాసరెడ్డికి కూడా అదే కేసులో ఈడీ నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం వైసీపీలోను, మాగుంట అభిమానుల్లోను ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ నెల 18న మాగుంట హాజరైతే పరిణామాలు ఎలా ఉండబోతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

రేపటి నుంచి భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎండలు మండితున్న వేళ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. వరుసనగా నాలుగు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. జార్ఖండ్ నుంచి చత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ఒక ద్రోణి కొనసాగుతోందని, దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి, మరికొన్ని చోట్ల మోస్తారు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. 18, 19 తేదీల్లో శ్రీకాకుళం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, కడప, తిరుపతి జిల్లాల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని వివరించింది. ఇదే సమయంలో ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. విశాఖ తీర ప్రాంతంలో ఈదురు గాలులు గురువారం సాయంత్రం నుంచి మొదలయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు సమోదై కొత్త రికార్డులు సృష్టించాయి. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కి వర్షం ఆటంకం

విశాఖ పీఎం పాలెం స్టేడియంలో ఈనెల 19 ఆదివారం జరగనున్న భారత్-ఆస్ట్రేలియా రెండవ వన్డే మ్యాచ్‌కి వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉండటంతో క్రీడాభిమానులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం ముంబైలో మొదటి వన్డే జరగనుంది. విశాఖలో జరిగే రెండో వన్డేపై అనుమానాలు బలపడతున్నాయి.

విచారణకు కవిత దూరం

(మొదటిపేజీ తరువాయి)

పంపాను. నా హక్కుల రక్షణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ఈ నెల 24న నా పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రానుంది' అని కవిత తన లేఖలో పేర్కొన్నారు.దిల్లీ మద్యం కేసులో కవితకు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఈడీ పేర్కొంది. తాను నేడు విచారణకు హాజరుకాలేనని, మరో రోజు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొనడంతో మరో తేదీని ఖరారు చేస్తూ కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 11న దాదాపు ఎనిమిది గంటల పాటు కవితను సుదీర్ఘంగా విచారించిన ఈడీ అధికారులు...16న మరోసారి విచారణకు రావాలని అదే రోజు సమన్లు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, మళ్లీ హాజరుకావాలంటూ జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె దాఖలు చేసిన వ్యాజ్యంపై తక్షణ విచారణకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 24న విచారణ చేపడతామని సీజేఐ స్పష్టం చేశారు. ఈ నెల 16న హాజరు కావడంపై ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించలేదు. ఈ అంశంపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సైతం కోర్టు నిరాకరించింది. కవిత ఈరోజు ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో సమావేశం అనంతరం ఈడీకి ఈ మెయిల్ పంపారు.

అరుణ్ పిళ్లై ఈడీ కస్టడీ పొడిగింపు

ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లై కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈడీ వాదనలు వినిపిస్తూ.. 'ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరితో కలిపి పిళ్లైని ప్రశ్నించాల్సి ఉంది. 10 రోజుల కస్టడీలో పిళ్లై ముందు హోటల్ రికార్డులు, పత్రాలు ఉంచి విచారణ చేశాం. కొందరు నిందితులు, సాక్షులను కలిపి జరుపుతున్న విచారణ ఇంకా పూర్తి కాలేదు. అందుకని ఆ వ్యక్తులను మరోసారి విచారణకు రావాలని ఆదేశించాం. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కవిత ఇవాళ్టి ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఈ పరిస్థితుల్లో పిళ్లై కస్టడీ పొడిగించాల్సి ఉంటుంది' అని కోర్టుకు ఈడీ వివరించింది. వాదనలు విన్న సీబీఐ ప్రత్యేక కోర్టు.. మరో మూడు రోజుల పాటు పిళ్లై కస్టడీ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

కవితను ఈడీ వేధిస్తోంది: న్యాయవాది భరత్

ఎమ్మెల్సీ కవితపై ఈడీ అధికారులు అన్యాయంగా కేసులుపెట్టి వేధిస్తున్నారని ఆమె తరపు న్యాయవాది భరత్ అన్నారు. అనారోగ్యం అని అసత్యప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మహిళను ఇంటి వద్దే విచారించాలని తెలిపారు. విచారణకు మళ్లీ ఎప్పుడు రావాలో ఈడీ చెప్పలేదన్నారు. కవితకు ఈడీ సమన్లపై సుప్రీంకోర్టులో తాము దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 24న విచారణకు రానుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తదుపరి ఆదేశాల ప్రకారమే తాము ముందుకెళ్తామని స్పష్టంచేశారు.

మళ్లీ టీడీపీ సభ్యుల సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : శాసనసభ రెండో రోజూ కూడా టీడీపీ సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. 'దివాలా బడ్జెట్.. జగన్ రెడ్డి కళకళ.. ప్రజలు గిలగిల' అని బ్యానర్‌తో టీడీపీ సభ్యులు అసెంబ్లీ వెలుపల ఆందోళన చేపట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. దీనిపై సీఎం జగన్‌తో పాటు శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ బడ్జెట్‌ను అడ్డుకోవడం తగదన్నారు. ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలన్నారు. కానీ టీడీపీ సభ్యులు నినాదాలు కొనసాగించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. బడ్జెట్ ప్రసంగానికి అవరోధం కలిగించినందుకు టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని స్పీకర్‌కు సీఎం సిఫార్సు చేయగా 14 మంది సభ్యులను ఒకరోజు కోసం స్పీకర్ సస్పెండ్ చేశారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా నిరసనలో పాల్గొన్నారు. 'ఏపీలో దివాలా బడ్జెట్, జగన్ రెడ్డి కళకళ, ప్రజలు గిలగిల' అన్న ప్లకార్డుతో బాలకృష్ణ నిరసన తెలిపారు. అసెంబ్లీ లాబీల్లో బాలకృష్ణను మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, అమర్నాథ్ పలకరించారు. 'ఏం హీరో గారు' అంటూ బాలయ్యకు బొత్స అభివాదం చేశారు. ఇవాళ కోటు వేసుకురాలేదేమని అమర్నాథ్‌నుద్దేశించి బాలయ్య చమత్కరించారు.

దగాకోరు బడ్జెట్: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర బడ్జెట్ మొత్తం డొల్లేనని కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మోసపూరిత, దగాకోరు బడ్జెట్‌తో జగన్ అండ్ కో మరోసారి ప్రజల్ని మోసగించడానికి సిద్ధమయ్యారు. ఆచరణలో సాధ్యంకాని గణాంకాలను బడ్జెట్లో ఆర్థికమంత్రి బుగ్గన వల్లె వేశారు. బీసీలకు ఏర్పాటుచేసిన 54 కార్పొరేషన్లతో ఆయా వర్గాల యువతీ, యువకులు ఒక్క రూపాయి అయినా స్వయం ఉపాధి పొందారా? ఒక్క కార్పొరేషన్‌కు కూడా పైసా నిధులివ్వకుండా, బడ్జెట్లో మాత్రం నిధులిచ్చినట్టు అబద్ధాలు చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తానన్న జగన్ ఆ హామీని విస్మరించారు. సాగునీటి రంగానికి గత బడ్జెట్లో రూ.12వేల కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పిన ప్రభుత్వం...కేవలం రూ.4 వేలకోట్లే ఖర్చుపెట్టింది. రోడ్లు, రహదారులకు రూ.9 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారు. ఒక్కపైసా ఖర్చుపెట్టింది లేదు. వ్యవసాయరంగానికి రూ.15వేల కోట్లు అన్నారు. ఖర్చుమాత్రం నామమాత్రమే. ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్టే భవిష్యత్‌లో జగన్, అతని మంత్రులకు ఉరితాడు అవుతుందని హెచ్చరించారు.

మోదీవి దృష్టిమళ్లించే కుయుక్తులు

న్యూదిల్లీ: బీజేపీ ప్రభుత్వం 'దృష్టిమళ్లించే' కుయుక్తులను ప్రదర్శిస్తోందని ప్రతిపక్షాల ఎంపీలు ఆరోపించారు. తన ఆప్తమిత్రుడిని కాపాడుకునే ప్రయత్నాల్లో ప్రధాని నిమగ్నమై ఉన్నారని విమర్శలు గుప్పించారు. అదానీ గ్రూపు అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ కోసం ఐక్యంగా డిమాండ్ చేస్తూ గురువారం పార్లమెంటు ఆవరణలో మానవహారాన్ని ప్రతిపక్షాల ఎంపీలు ఏర్పాటు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డీఎంకే నేత టీఆర్ బాలు, ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్, ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా, శివసేన (ఠాక్రేవర్గం) నేతలు ప్రియాంక చతుర్వేది, అరవింద్ సావంత్ పాల్గొన్నారు. 'అదానీ గ్రూపుకు వ్యతిరేకంగా విచారణకు డిమాండ్ చేసేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమయ్యాయి. తన మిత్రుడైన అదానీని కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తుండటం దురదృష్టకరం' అని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ అన్నారు. బుధవారం ఈడీ కార్యాలయం వరకు విపక్షాల నేతలు చేపట్టిన మార్చ్‌ను దిల్లీ పోలీసులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తేందుకు విపక్షాలకు అనుమతి ఇవ్వడంలేదని, వారి మైకులు కట్టేస్తున్నారని గొగోయ్ చెప్పారు. అదానీ గ్రూపుపై జేపీసీ విచారణ కోసం మానవహారం ఏర్పాటు చేయాలనే నిర్ణయం ఉదయం ఖర్గే నేతృత్వంలో జరిగిన విపక్ష నేతల సంయుక్త సమావేశంలో జరిగింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీఎంకే, ఎన్‌సీపీ, ఎస్పీ, ఆర్‌జేడీ, బీఆర్ఎస్, శివసేన (ఠాక్రేవర్గం), జేడీయూ, జేఎంఎం, ఎండీఎంకే, ఆప్, వీకేసీ, ఐయూఎంఎల్ నేతలు హాజరయ్యారు. కాగా ఓ వ్యాపారవేత్తను కాపాడేందుకు పార్లమెంటును స్తంభింపజేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని నీరుకార్చడమే కాకుండా తక్కువచేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఘాటుగా విమర్శించింది.

నీటి పారుదలకు మొండి చేయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023-24 వార్షిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్ నామ మాత్రపు కేటాయింపులతోనే సరిపెట్టింది. నీటి పారుదల శాఖ బడ్జెట్ రూ.11,908.10 కోట్లు (దాదాపు 5.25శాతం)నిధులతోనే సర్దుబాటు చేసింది. ఈ రంగానికి మొక్కుబడి నిధులతో మొండిచేయి చూపించింది. నామ మాత్రపు కేటాయింపులు, అంకెల గారడీతో బడ్జెట్‌ను ఆర్భాటంగా ప్రభుత్వం రూపొందించిందన్న విమర్శలున్నాయి. ఈ రంగానికి గతం కంటే...కేవలం రూ.500 కోట్లను అదనంగా చూపింది. అత్యంత ప్రాధాన్యత రంగమైన నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని సీపీఐ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి నేతృత్వంలో రాష్ట్ర నాయకత్వం బృందం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని అధ్యయనం చేసింది. అనంతరం వివిధ పార్టీలు, రైతు సంఘాల ప్రతినిధులతో విజయవాడ దాసరిభవన్‌లో రౌండుటేబుల్ సమావేశం తీర్మానించి...వాటిని ప్రభుత్వం దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలిచ్చినా ఫలితం లేకపోయింది 2023-24 వార్షిక సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్‌ను రూ.41436.29కోట్ల అంచనాలతో ప్రతిపాదిస్తూ...శాసన సభలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, శాసన మండలిలో పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వేర్వేరుగా ప్రవేశపెట్టారు. మరో ఏడాదిలోగా సీఎం జగన్ ప్రభుత్వం పదవీ కాలం ముగియనుంది. ఈలోగా ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం కలిగించేలా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవు. మొత్తం సాగునీటి ప్రాజెక్టులకు గతంలో దాదాపు రూ.11వేలకుపైగా కోట్లు కేటాయించగా, దాంట్లో ఖర్చు చేసింది రూ.6,500 కోట్లు మాత్రమే. కేటాయింపులే అరకొర..దానికి తోడు ఖర్చునూ తక్కువగానే చేపట్టారు. అటు వ్యవసాయ రంగంపై 65శాతం మంది ఆధారపడి ఉంటారు. ఈ రంగంపై ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులూ నామ మాత్రమే. ధరల స్థిరీకరణ నిధికి రూ.3వేల కోట్లు కేటాయింపు ఏ మాత్రమూ చాలవు. కనీసం రూ.25వేల కోట్లు అయినా ఉండాలంటూ రైతు సంఘాల నేతల డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను నెలకొల్పేందుకు తగిన నిధులనూ పెట్టలేదు. ఏతావాతా బడ్జెట్‌లో వ్యవసాయ, ఇరిగేషన్ రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని, ప్రాధాన్యత కలిగిన ఈ రెండు రంగాలకు నిధులు పెంచాల్సిన అవసరముంది. రాష్ట్రంలో కౌలు రైతులు నూటికి 70శాతం ఉండగా, వారికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపింది. పేద వర్గాల పక్షానే నేనుంటానంటూ సీఎం జగన్ చెప్పడమేనని...కౌలు రైతుల్లో అత్యధికం ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలే ఉంటారనీ, వారికే సరైన నిధుల సౌకర్యం కల్పించకుంటే ఏ విధంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు న్యాయం చేసినట్లవుతుందని రైతు, కౌలు రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

ఆర్బీకే మరింత పటిష్టవంతం: మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీదిరి అప్పలరాజు

ఈ బడ్జెట్‌లో ఆర్‌బీకేలకు శాశ్వత భవనాలు కల్పిస్తున్నామని, వాటిని మరింతగా పటిష్టం చేయనున్నామన్నారు. 8836 ఆర్బీకే భవనాలు వివిధ దశల్లో ఉంగా...వాటిని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని, యూట్యూబ్ ఛానళ్లు, మాసపత్రికలను ప్రారంభించామని మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, సీదిరి అప్పలరాజు బడ్జెట్ ప్రవేశపెడుతూ వెల్లడించారు. రెండేళ్లుగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో జాతీయభివృద్ధి రేటు కంటే...రాష్ట్రాభివృద్ధి రేటు అధికంగా ఉందని విశ్లేషించారు. 2021-22లో జాతీయ స్థాయిలో 10 శాతం వృద్ధికాగా, రాష్ట్రం 13.07 శాతం వృద్ధి సాధించిందన్నారు. 2022-23లో జాతీయ స్థాయిలో 11.2 శాతం వృద్ధి నమోదవ్వగా, రాష్ట్ర వృద్ధి రేటు 13.18 శాతంగా నమోదైనట్లు వివరించారు. 44 నెలల్లో రాష్ట్రంలో వ్యవసాయానుబంధ రంగాలకు రూ.లక్షా54వేల కోట్లు ఖర్చు చేసినట్లు, వ్యవసాయ విద్యుత్‌తో పగటి పూట 9గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో వ్యవసాయరంగానికి ఊతమిచ్చినట్లయిందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని కర్షక దేవాలయాలుగా తీర్చిదిద్దీ విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతులకు సేవలందిస్తున్నారని చెప్పారు. 2022-23కుగాను మన దేశం తరుపున ఎఫ్ఏవో చాంఫియన్ అవార్డుకు రైతు భరోసా కేంద్రాలు ఎంపికయ్యాయని, ఈ రైతు భరోసా కేంద్రాలను మరింత బలోపేతం చేయటానికి 2023-24 బడ్జెట్‌లో రూ.41.55 కోట్లు ప్రతిపాదించామన్నారు. ఆర్బీకేల్లో 50వేల టన్నుల ఎరువులను నిల్వ చేస్తున్నామన్నారు. వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటు చేశామని, పంటల ప్రణాళిక, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల పర్యవేక్ష చేపడుతున్నామని వివరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులు ఎక్కడా కరవు, కాటకాలను ఎదుర్కోలేదని, వారికి వాటర్ గన్‌ల అవసరమే రాలేదని, వర్షాలు సమృద్ధిగా కురిశాయన్నారు. రూ.6.01 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేశామని, 9లక్షల మంది కౌలు రైతులకు లబ్ది చేకూరిందన్నారు. తమ ప్రభుత్వం వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటు చేసిందని, 3.50లక్షల మంది సన్నకారు రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, డ్రోన్ల ద్వారా పురుగుల మందు పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే) ద్వారా 10వేల డ్రోన్లను రైతులకు అందజేస్తామని, ఆర్బీకేల ద్వారా ఇప్పటివరకు 6940 కోట్లు కేటాయింపులు చేపట్టామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా లక్షా 61వేల మంది రైతులకు లబ్ది చేకూరుస్తున్నామని, మార్కెటింగ్ శాఖాభివృద్ధికి రూ.513.74 కోట్లు కేటాయించామని వివరించారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేటాయింపులివీ...

- వ్యవసాయశాఖకు రూ.12,369.59 కోట్లు
- ఉద్యాన రైతుల అభివృద్ధికి రూ.656.64 కోట్లు
- పట్టు పరిశ్రమ విభాగానికి మొత్తం రూ.99.72 కోట్లు
- మార్కెటింగ్ శాఖకు రూ.513.74 కోట్లు
- ఫుడ్ ప్రాసెసింగ్‌కు రూ.286.41 కోట్లు
- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.472.57 కోట్లు
- డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రూ.102.04 కోట్లు.
- శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం రూ.138.50 కోట్లు
- ఏపీ మత్స్య విశ్వవిద్యాలయానికి రూ.27.45 కోట్లు
- పశు సంవర్ధకశాఖకు రూ.1114.23 కోట్లు
- మత్స్యశాఖ అభివృద్ధికి రూ. 500.83 కోట్లు
- వ్యవసాయ, విద్యుత్ సబ్సిడీ కోసం రూ.5500 కోట్లు
- ఉపాధి హామీ పథకం, వ్యవసాయ అనుసంధానంతో మొత్తం రూ.5100 కోట్లు
- వైఎస్ఆర్ జల కళ అమలుకు రూ.253 కోట్లు.
- నీటి పారుదల శాఖ బడ్జెట్ రూ.11,908.10 కోట్లు
- ఆర్బీకేలను మరింత బలోపేతం చేసేందుకుగాను ఈ బడ్జెట్‌లో రూ.41.55 కోట్లు ప్రతిపాదించారు.
- డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం అమలుకు రూ.1600 కోట్లు
- రైతులకు ఆర్థిక ఆర్థిక వెసులుబాటు కల్పించే పథకం కోసం రూ.500 కోట్లు
- రాయితీ విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు
- ప్రకృతి విపత్తుల సహాయ నిధి కింద రూ.2వేల కోట్లు
- ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ కోసం రూ.37.39కోట్లు
- రైతుల ఎక్స్‌గ్రేషియా కోసం రూ.20కోట్లు

నవరత్నభరిత బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

తన బడ్జెట్ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. అలాగే మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా 'కల అంటే నిద్రలో వచ్చేది కాదు, నిద్ర పోకుండా చేసేది' అంటూ ఆయన స్ఫూర్తిదాయకమైన మాటలతో బడ్జెట్‌ను ముగించారు. సుస్థిర అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. రైతు లేనిదే రాజ్యం లేదని విశ్వసించే ప్రభుత్వం తమదని, అందుకే పేదల సంక్షేమ పథకాలతో పాటు, వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యనిస్తూ నిధులు కేటాయింపులు చేశామన్నారు. పేదరిక నిర్మూలన, ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలను అందించడం వైసీపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. సాధికారత పొందిన ప్రజలు, రాష్ట్రాన్ని స్థిరమైన అభివృద్ధి పథకంలో నడిపిస్తూ ప్రపంచానికి తమ సత్తాను చాటాలన్నదే ప్రభుత్వ ఆకాంక్షగా పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతిని గమనించడానికి రాష్ట్ర ప్రభుత్వం 475 సూచికలతో కూడిన రాష్ట్ర ముందస్తు సూచికను అభివృద్ధి చేసింది. నవరత్నాలు సహా అన్ని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఉద్దేశించిన ఫలితాల ఆధారంగా 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానమైనట్లు వివరించారు. ముఖ్యంగా మహిళా సాధికారత మా ప్రభుత్వ విధానంలో ఒక ప్రధాన లక్షణమన్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అనేది వికేంద్రీకృత, పౌర కేంద్రీకృత, పారదర్శక పాలన యొక్క విశిష్ట నమూనాగా అభివర్ణించారు. ఈ వ్యవస్థ బలోపేతానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3,858 కోట్లు ప్రతిపాదించినట్లు మంత్రి చెప్పారు. కరోనా సంక్షోభ సమయంలో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ సునాయసంగా అధిగమించామన్నారు. విత్తనం నాటే దగ్గర నుంచి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం వరకు రైతుకు అండగా నిలుస్తున్న రైతు భరోసా కేంద్రాల పనితీరును వివిధ రాష్ట్రాలతోపాటు, ప్రపంచ దేశాలు కూడా మెచ్చుకుంటున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రాభివృద్ధిలో పాడి రంగం కీలక పాత్ర పోషిస్తుందని, గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ మొదటిస్థానంలో ఉందన్నారు. మాంసం ఉత్పత్తిలో రెండో స్థానం, పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందన్నారు. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమం కింద ఈ ఏడాది చివరి నాటికి 30.2 లక్షల శాశ్వత గృహాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టంగా మంత్రి పేర్కొన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులతో పాటు ఆర్థిక వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజల పరిపూర్ణ అభివృద్ధి కోసం బీసీలకు 56 కార్పొరేషన్లు, షెడ్యూలు కులాలకు 3, షెడ్యూలు తెగలకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం కోసం మౌజన్‌లకు నెలకు రూ.5వేలు, ఇమామ్‌లకు రూ.10వేలు, పాస్టర్లకు రూ.5వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తూ, వారిని హజ్, జెరూసలేం యాత్రలకు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పంపిస్తున్నట్లు చెప్పారు. పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న సంక్షేమ పథకాలను, వాటి వల్ల వస్తున్న ఫలితాలను ప్రముఖుల కొటేషన్లతో మంత్రి చదివి వినిపించారు. నాడు-నేడు కార్యక్రమాలతో విద్యా, వైద్యరంగాలను ప్రక్షాళన చేశామని, ఆయా రంగాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ నిధుల కేటాయింపులు చేసినట్లు చెప్పారు. ఆయా రంగాల వారీ బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా ఉన్నాయి.

- మొత్తం డీబీటీ స్కీంలకు రూ.54,228.36 కోట్లు
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.41,436 కోట్లు
- పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి రూ.15,873 కోట్లు
- పర్యావరణం , అటవీ, శాస్త్ర సాంకేతికత శాఖ రూ. 685 కోట్లు
- ఎనర్జీ రూ.6,456 కోట్లు
- గ్రామ , వార్డు సచివాలయాల శాఖకు రూ.3,858 కోట్లు
- గడప గడపకు మన ప్రభుత్వం రూ.532 కోట్లు
- మన బడి నాడు నేడు రూ.3,500 కోట్లు
- పేదలందరికీ ఇళ్ల రూ.5,600 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్యం రూ.2,602 కోట్లు
- రోడ్లు, భవనాలు శాఖ రూ.9,118 కోట్లు
- నీటి వనరుల అభివృద్దికి రూ.11,908 కోట్లు
- ధరల స్థిరీకరణ నిధి రూ.3 వేల కోట్లు
- వ్యవసాయ యాంత్రీకరణ రూ.1,212 కోట్లు
- వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం రూ.15,882 కోట్లు
- పురపాలక పట్టణాభివృద్ధి రూ.9,381 కోట్లు
- స్కిల్ డెవలప్‌మెంట్ రూ.1,166 కోట్లు
- షెడ్యూల్ తెగల కాంపొనెంట్ కోసం రూ.6,929 కోట్లు
- వెనుకబడిన తరగతుల కాంపొనెంట్ కోసం రూ.38,605 కోట్లు
- యువజన అభివృద్ధి, పర్యాటకం, సాంస్కృతి శాఖ రూ.1,291 కోట్లు
- షెడ్యూలు కులాల కాంపొనెంట్ కోసం రూ.20,005 కోట్లు
- వ్యవసాయ రంగానికి రూ.11,589 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1787 కోట్లు
- జీఏడీకి రూ.1418 కోట్లు కేటాయింపు
- హోంశాఖకు రూ.8206 కోట్లు కేటాయింపు
- గృహనిర్మాణ శాఖకు రూ.6292 కోట్లు
- గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.3858 కోట్లు
- నీటిపారుదల రంగానికి రూ.11,908 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్యం రూ.2602 కోట్లు
- మౌలిక వసతులు, పెట్టుబడులకు రూ.1295 కోట్లు
- కార్మిక శాఖకు రూ.796 కోట్లు ● ఐటీ శాఖకు రూ.215 కోట్లు
- న్యాయశాఖకు రూ.1058 కోట్లు
- అసెంబ్లీ, సెక్రటేరియట్ రూ.111 కోట్లు
- పట్టణాభివృద్ధికి రూ.9381 కోట్లు కేటాయింపు
- మైనార్టీ సంక్షేమానికి రూ.2240 కోట్లు కేటాయింపు
- నగదు బదిలీ పథకాలకు రూ.54 వేల కోట్లు
- ఇంధన శాఖకు రూ. 6546 కోట్లు కేటాయింపు
- అగ్రవర్ణ పేదల సంక్షేమానికి రూ. 11,085 కోట్లు
- సివిల్ సప్లై - రూ. 3725 కోట్లు, జీఏడీకి రూ.1,148 కోట్లు
- పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ రూ.1.67 కోట్లు, ప్రణాళిక 809 కోట్లు
- రెవెన్యూ రూ.5380 కోట్లు, రియల్ టైం గవర్నెన్స్ రూ.73 కోట్లు
- స్కిల్‌డెవలప్‌మెంట్‌కు రూ. 1167 కోట్లు
- ఆర్ అండ్ బి కి రూ.9119 కోట్లు కేటాయింపులతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బడ్జెట్‌ను ప్రతిపాదించగా, శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఆస్తులమ్మి బాధితులకు చెల్లించాలి

- బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించాలి
- అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలో పద్మశ్రీ, జంగాల డిమాండ్
- నేడు సామూహిక సత్యాగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి ఆ డబ్బుతో ఆ సంస్థ బాధితులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ గురువారం డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరుగుతున్న బాధితుల రిలే నిరాహారదీక్షకు జంగాల, పద్మశ్రీ సంఘీభావం తెలిపారు. సుంకర పద్మశ్రీ, అజయ్‌కుమార్ దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ మాట్లాడుతూ చివరి బడ్జెట్‌లోనైనా బాధితుల కోసం రూ.3వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమానికి ప్రారంభం నుంచి కాంగ్రెస్ మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. గతంలోనూ రఘువీరా రెడ్డి, తులసిరెడ్డి సహా కాంగ్రెస్ నేతలు ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏజెంట్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బాధితులను ఆదుకుంటామన్న హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీకి చెందిన వేలాది ఎకరాలు గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. అగ్రిగోల్డ్ భూములను జగనన్న కాలనీల కోసం ప్రభుత్వమే కొనుగోలు చేస్తే బాగుండేదన్నారు. దీనివల్ల ఎమ్మెల్యేలు జేబులు నింపుకునే అవకాశం లేకుండా చేసినట్లు ఉండేదన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం ఇటీవల అక్రమంగా అమ్మిన ఆస్తులను సీఐడీ తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ స్పందించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లా గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు పోరాటం చేస్తున్నారని, ఉద్యమ చరిత్రలో ఇది నిలిచిపోతుందన్నారు. అమరావతి రాజధాని జేఏసీ నాయకులు పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ మరణించిన బాధిత కుటుంబాలకు 10 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ శుక్రవారం విజయవాడ దాసరి భవన్ వద్ద సామూహిక సత్యాగ్రహంలో వేలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్వర్డు బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సుందర రామరాజు, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్‌కే సుభానీ, ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి నాజర్‌బి, ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు. రెండవ రోజు రిలే దీక్షలో గుంటూరు జిల్లా నుంచి అంజనీదేవి, పాపాయమ్మ, అగస్టీన్, కరిముల్లా, కాకినాడ జిల్లా నుంచి శ్రీనివాస్, జనకుల బాబి, భాగ్యరాజ్, శేఖర్ లోవరత్నం, చిత్తూరు జిల్లా నుంచి కృష్ణయ్య, ఎం.గంగాధర్, ఎం.జయచంద్రరావు కూర్చున్నారు.

20న జేసీ కార్యాలయాల ముందు ధర్నా

పౌరసరఫరాల హమాలీ వర్కర్స్ యూనియన్ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. పేద ప్రజలకు బియ్యం సరఫరాలో కష్టపడి పనిచేస్తున్న హమాలీలను వేధించడం ప్రభుత్వానికి తగదన్నారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో పౌరసరఫరాల హమాలీ వర్కర్ల యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చినాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా దానిపై చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. పౌరసరఫరాల కార్పొరేషన్‌లో అధికారులు రకరకాల కొత్త విధానాలను ప్రవేశపెడుతూ. వాటికి అనవసరమైన ఖర్చులు చేస్తూ వేలకోట్ల అప్పుల్లో ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన కూలిని, పెరిగిన కూలి ధరల బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జగన్ ప్రభుత్వం సరైన విధానాలను రూపొందించకుండా ఆయన ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న అన్ని జిల్లా జాయింట్ కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించాలని, ఏప్రిల్ 5వ తేదీన భారీ ఎత్తున ఆందోళన సాగించాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు, అంజిబాబు, చిక్కాల గోవింద్. టి.వీరబాబు, శ్రీమన్నారాయణ, పెంచలయ్య, సూర్యుడు, అయ్యప్ప, పైడయ్య, మాధవ నాగేశ్వరరావు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల పుట్ట...బడ్జెట్ చిట్టా

- అసెంబ్లీ, శాసన మండలిలో టీడీపీ నిరసన
- బడ్జెట్ ప్రసంగానికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'ఇది అప్పుల పుట్ట...బడ్జెట్ చిట్టా'... అంటూ అసెంబ్లీ, శాసన మండలిలో గురువారం బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో టీడీపీ సభ్యులు నిరసనలకు దిగారు. మండలి చైర్మన్, స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నినదించారు. శాసన మండలిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉప ముఖ్య మంత్రి అంజాన్‌భాషా బడ్జెట్‌ను చదువుతుండగా టీడీపీ సభ్యులు అంతరాయం కల్పించారు. టీడీపీ సభ్యులు బి.తిరుమల నాయుడు, కేఈ ప్రభాకర్, దువ్వారపు రామారావు, దీపక్‌రెడ్డి తదితరులు తమ తమ స్థానాల నుంచి లేచి వెల్‌లోకి వచ్చి చైర్మన్ ఎదురుగా 'అప్పుల పుట్ట-బడ్జెట్ చిట్టా', కాసుల గల గల-అభివృద్ధి వెల వెల' అనే ప్లకార్డులు చూపిస్తూ నిరసన ధ్వనులు చేశారు. మండలి చైర్మన్ పోడియం వద్దకు వచ్చి పేపర్లు చించి వాటిని గాల్లోకి ఎగురవేశారు. వారికి పోటీగా అధికార పక్ష సభ్యులూ జై జగన్ అంటూ నినదించారు. సభలో ప్రతిపక్ష అధికార పక్ష సభ్యుల పరస్పర నినాదాలతో గందరగోళంలోనే ఉప ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగించారు. సభ ప్రారంభమైన గంట తరవాత ప్రతిపక్ష సభ్యులు తమ చేతులలోని ప్లకార్డులు చించి గాలిలోకి విసిరేసి నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. చైర్మన్ వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ సభ్యులు ఆగకుండా నిరసనలతో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. అనంతరం టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే కొద్దిసేపు మండలిని వాయిదా వేశారు. అనంతరం రూ.41,436.29 కోట్లతో వ్యవసాయశాఖ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ రాష్ట్ర పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రవేశపెట్టారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

- నేడు విజయవాడలో సామూహిక ధర్నా జయప్రదం చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కీమ్ కార్మికుల కనీస వేతనాల అమలు కోసం ఈ నెల 17వ తేదీ శుక్రవారం విజయవాడ ధర్నా చౌక్‌లో తలపెట్టిన రాష్ట్ర స్థాయి సామూహిక ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కీం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారించాలని, కనీస వేతనాల అమలు కోసం ఈనెల 17న విజయవాడలో రాష్ట్రస్థాయి సామూహిక ధర్నా నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే (స్కీమ్ కార్మికులు) ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, స్కూల్ స్కావేంజర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో స్కీమ్ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల సమస్యల పట్ల వైసీపీ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తోందని, వారి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, కనీస వేతనాలు అమలు చేయకుండా వారి శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా యాప్‌ల పేరుతో ఇబ్బందులు పెడుతూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీ ఏమైందంటూ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తక్షణమే గ్రాట్యూటీ అమలు చేసి 62 ఏళ్ల పదవీ విరమణ వయసును పెంచాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 'జగనన్న గోరుముద్ద' పథకం మెస్ చార్జీలు పెంచాలని, రూ.7 లేదా రూ.8తో ఒక పూట భోజనం ప్రస్తుత పరిస్థితుల్లో వస్తుందా ? అని ప్రశ్నించారు. నెలకు రూ.3వేలతో కార్మికుల కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. తక్షణమే విద్యార్థి మెస్ చార్జీలు, కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. నెల నెలా వేతనాల బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. ఆశ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారిని సెకండ్ ఏఎన్ఎంలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పాఠశాల స్వీపర్లకు కనీస వేతనం అమలు చేసి, నిలిచిన వారి వేతనాల విడుదల చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందేగానీ, కార్మికులకు వేతనాలు పెంచడం, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. తక్షణమే మహిళా కార్మికులు పనిచేసే చోట పని భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ న్యాయమైన సమస్యల సాధన కోసం ఈనెల 17వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే 'సామూహిక రాష్ట్రస్థాయి ధర్నాకు పెద్దఎత్తున మహిళా కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు లలితమ్మ, రమేష్ బాబు, శాంతి, బాలకృష్ణ, జయ కుమారి, శైలజ, ఏఐటీయూసీ విజయవాడ నగర కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

భారీగా దొంగనోట్ల పట్టివేత

తొమ్మిది మంది ముఠా అరెస్టు

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, వీఆర్ పురం మండలాల్లో నకిలీ కరెన్సీ నోట్లను చలామణి చేస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఓ ముఠా నకిలీ నోట్లను ముద్రించి చలామణి చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎటపాక సీఐ గజేంద్ర కుమార్, కూనవరం ఎస్సై బి వెంకటేశ్ వారి సిబ్బందితో కలిసి 15వ తేదీన రేకపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, భద్రాచలం గ్రామాల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించి తొమ్మిదిమందిని అరెస్టు చేశారు. ఇందులో ఒక మహిళ కూడా ఉన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... ఈ కేసులో 9 మంది ఉన్నారని, (పాల్వంచకు చెందిన పొదిల మురళి, జంగం శ్రీనివాస్, కటారి సామ్రాజ్యం, భద్రాచలానికి చెందిన గౌడు గోళ్ల కిరణ్ కుమార్, అశ్వరావుపేట మండలం అచ్యుతాపురం గ్రామానికి పాకపాటి నాగేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ఉప్పల్ కు చెందిన పసుపులేటి ఉమేష్ చంద్ర, పల్నాడు జిల్లా మాచర్ల కు చెందిన వేముల పుల్లారావు, పొదిలి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి గ్రామానికి చెందిన కొనకళ్ళ చిట్టి బాబు) వీరందరూ పాల్వంచలోని పోదిల మురళి ఇంటి వద్ద రహస్యంగా దొంగ నోట్లు ముద్రించడం మొదలు పెట్టారు. వీరిలో కొనకళ్ళ చిట్టిబాబు, వేముల పుల్లారావు, జంగం శ్రీనివాస్, పొదిలి మురళి ఇంట్లో నోట్ల ముద్రించడానికి సహకరించే వారు. ముద్రించిన నోట్లను చింతూరు, నెల్లిపాక, వి ఆర్ పురం, కూనవరం, చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట గ్రామాల్లో మార్చేవారని, పదివేల రూపాయలు అసలు నోట్లకు లక్ష రూపాయల నకిలీ నోట్లు అందజేసే వారని తెలిపారు. ఈ విధంగా రాత్రుళ్లు ఆయిల్ బంకుల్లోనూ కిరాణా షాపుల్లోనూ హోటళ్లలోనూ మార్చేవారు. వీరి నుండి రూ.45లక్షల నకిలీ నోట్లు, రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్, ఒక మానిటర్‌ను, ఒక లామినేషన్ మిషన్, 500 రూపాయల నకిలీ నోటు సైజుల్లో కటింగ్ చేయబడ్డ బ్లాక్, కలర్ బండిల్సును, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టయిన నిందితుల్లో పల్నాడు కు చెందిన జంగం శ్రీనివాస్ పై మాచర్ల, దుర్గి, మేడికొండూరు పోలీస్ స్టేషన్లలో దొంగ నోట్ల విషయమై కేసులు ఉన్నాయి. అలాగే పాతపాటి నాగేశ్వరరావు పై వినన్నపేట, జంగారెడ్డి గూడెం, చేబ్రోలు, అశ్వరావుపేట, పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసులు గతంలో నమోదయ్యాయని ఎస్పీ వెల్లడించారు. నిందితులందరినీ రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. దొంగనోట్ల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎటపాక సీఐ గజేంద్ర కుమార్, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక ఎస్ఐలు పార్థసారథి, దుర్గాప్రసాద్, బి.వెంకటేష్, పోలీస్ సిబ్బంది విక్టర్ బాబు, జయచంద్ర రామాంజనేయులు, వెంకటేశ్వరరాజు, రవి, నిర్మల్‌కుమార్, ప్రసాద్ చినబాబులు, వెంకటరత్నం, డి.శ్రీనివాస్, శ్రీనుబాబు, ఎం.దుర్గారావు, కె.రామకృష్ణ దొర, సూర్య కుమార్, ఎస్కే నజీమ్, ఆర్.వీరబాబులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

మోడల్ స్కూల్ హాస్టల్ కార్మికులకు

'కరోనా' పెండింగ్ వేతనాలివ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ బాబు వినతి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ హాస్టల్స్ కేజీబీవీ టైప్4లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కరోనా సమయంలో పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌బాబు కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఒప్పంద విధానంలో మార్పు తేవాలని కోరుతూ కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి మధుసూదన్ రావుకు గురువారం విజయవాడలోని సమగ్ర శిక్షణ రాష్ట్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్‌బాబు మాట్లాడుతూ మోడల్ స్కూల్ హాస్టల్ వర్కర్స్‌కు 2020, మార్చిలో కరోనా కారణంగా ఎనిమిది నెలలు జీతాలు ఇవ్వలేదన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ వర్కర్స్‌కి వేతనాలు ఇచ్చారని, హాస్టల్స్ సిబ్బందికి ఇవ్వలేదని చెప్పారు. వారందరినీ ఒప్పంద ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎనిమిది గంటల పనివిధానం అమలు చేసి డిప్యూటీ వార్డెన్, వాచ్‌మెన్ పోస్టులతో పాటు ఏఎన్ఎంను నియమించాలని కోరారు. వార్డెన్లకు 24 గంటల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆప్కాస్‌లో బంధించి వేతనాలు పెంచకుండా ఇబ్బంది పెట్టడం తగదని, సంక్షేమ పథకాలనూ వర్తింపజేయాలన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. పార్ట్‌టైం కార్మికులను అప్కాస్ పరిధిలోకి తేవాలని, అమ్మ ఒడి పథకాన్ని ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ వినతిపై కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు లలితమ్మ, శాంతి, శైలజ పాల్గొన్నారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ: జింకా చలపతి

విశాలాంధ్ర- ధర్మవరంటౌన్: చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడిందని, దీంతో నేతన్నల జీవితాలు అతలాకుతలమ య్యాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి విమర్శించారు. చేనేతపై పాలకుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోందన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జింకా చలపతి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేతన్నలకు చేతి నిండా పని లేదని, చేసిన పనికి కూలి రావడం లేదని, నేతనేద్దామంటే మగ్గాలు లేవని ఆయన చెప్పారు. మర మగ్గాల యజమానులు కోల్‌కతా నుంచి కార్మికులను రప్పించి... తక్కువ వేతనాలకు చీరలు నేయిం చుకుంటున్నారని చెప్పారు. 25 శాతం మించి బయటివారిని నియమించుకోకూడదన్న నిబంధనను తుంగలో తొక్కుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. పవర్‌లూమ్ చీరలను నేత చీరలుగా చెలామణి చేస్తూ మాస్టర్ వీవర్స్ చేనేత రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. మరమగ్గాల వల్ల చేనేత పరిశ్రమ కుంటుపడుతున్నదని, దీంతో నేతన్నలు ఉపాధి కోల్పోతున్నారని చలపతి వివరిం చారు. తనిఖీలు తంతుగా మారిందని, మాస్టర్ వీవర్స్‌కు ముందుగానే సమాచారం ఇవ్వడం, ముడుపులు తీసుకోవడం అధికారులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు ఈనెల 25వ తేదీన నేతన్నలతో సమావేశం నిర్వహిస్తామని, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి...ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చలపతి స్పష్టంచేశారు. చేనేత నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, ఆది తదితరులు పాల్గొన్నారు.

1700 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-చింతపల్లి: మన్యంలో గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. స్థానిక పోలీసులు గురువారం మండలంలోని పెంటపాడు గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఒడిశా రాష్ట్రం నుంచి సీలేరు, దారకొండ గూడెం, కొత్త వీధి మీదుగా వస్తున్న మహారాష్ట్రకు చెందిన వాహనాన్ని స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్, సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా వాహనంలో తరలిస్తున్న 1700 కేజీల గంజాయి బయటపడింది. దీంతో పట్టుబడిన గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లూరి జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ లు గురువారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. నిందితులను ఒడిశా రాష్ట్రానికి చెందిన సీతారాం, ఉత్తరప్రదేశ్ కు చెందిన అతని స్నేహితుడు, గంజాయి వ్యాపారస్తుడు రవీంద్ర యాదవ్, డ్రైవర్ ఫేకు యాదవ్‌లుగా గుర్తించారు. వీరితోపాటు మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతుల వెతలు తీర్చాలి

పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం మహాసభలో కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ: రైతులకు. కౌలు రైతులకు ఏపీ రైతు సంఘం అండగా నిలుస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక వెల్లటూరు రోడ్డు లోని జీవీసీ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. మహాసభకు ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు తాళ్లూరు బాబురావు అధ్యక్షత వహిం చారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము వక్తలను వేదిక పైకి ఆహ్వానించారు. ప్రసాద్ ప్రసంగం కొనసాగిస్తూ, రైతులు చాలా కష్టాల్లో ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా 140 కోట్ల మందికి రైతులు ఆహారం అందిస్తున్నా రని చెప్పారు. రైతు ఆదాయం పెంచుతానన్న పాలకులు రైతాంగాన్ని నట్టేట ముంచాయన్నారు. రైతుకు నెలకు ఆదాయం పదివేల మించి లేదని ఎలా గడుస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుకు నెలకు 18000 ఆదాయం ఉండాలని కేంద్రమే చెప్పిందని ఆయన అన్నారు. 2014 నుంచి రైతు ఆదాయం పెంచుతామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదే గాని ఆచరణలో లేదన్నారు. ఉద్యోగుల ఆదాయం 100 నుంచి 120 పెరిగిన, రైతు అభివృద్ధి రేటు ఏమాత్రం పెరగలేదు అన్నారు. దేశవ్యాప్తంగా ఒక్కొక్క రైతుపై 75 వేల అప్పు ఉండగా మన రాష్ట్రంలో ఒక్కొక్క రైతుపై రెండు లక్షల పైగా అప్పు చేరుకుందని ప్రసాద్ అన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ప్రతిరోజు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుండగా గ్రామాలు గ్రామాలు వలస బాట పట్టాయని అన్నారు. 2011లో రైతు సంఘం పోరాటాల ద్వారా కౌలు రైతు చట్టం వచ్చిందన్నారు. అ కౌలు రైతులు 16 లక్షల మంది ఉండగా. కేవలం నాలుగు లక్షల 75 వేల మందికి కౌలు రైతు కార్డులు అందాయన్నారు. వారికి బ్యాంకు రుణాలు కూడా 11.26 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు ఎస్సీ ఎస్టీ బీసీల్లోనే కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. బ్యాంకు రుణాలు కేవలం 41శాతం ఇస్తున్నారని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది కౌలు రైతులు ఉంటే కేవలం నాలుగు లక్షల మందికి కార్డులు వచ్చా యన్నారు. రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మిర్చి ధర అధికంగా ఉన్న కారణంగా బొల్లపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో రాత్రివేళ దొంగలు పొలాల్లో ఉన్న మిర్చిని ఎత్తుకుపోతున్నప్పటికీ పోలీ సులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని చెప్పారు. దొంగల్ని పట్టు కోకుండా పోలీసులు మాత్రం రాజకీయ ప్రత్యర్థు లపై తమ ప్రతాపం చూపుతున్నారని ముప్పాళ్ల విమర్శించారు రైతు సంక్షేమ పథకాలు పక్కన పెట్టి ఇంటింటికి పదివేలు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తున్నది అన్నారు. పేదలకు ఒక్కొక్కరికి రెండున్నర ఎకరాల భూమి అంటూ నేడు ఒక ఎకరం భూమి కూడా ఇవ్వలేదని చెప్పారు. నాటి రాజ్యాంగ హక్కులు హరించి వేస్తూ. రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం అమలు చేస్తున్నది అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నప్పటికీ అనేక ప్రాంతాలలో గుక్కెడు మంచినీళ్లు దొరకడం లేదన్నారు. ప్రజలు రైతులు రాజకీయంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని ముప్పాళ్ల పిలుపు నిచ్చారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జమలయ్య మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో కౌలు రైతుల సమస్యలు చర్చించి చట్టం పూర్తి స్థాయిలో అమలు పరచాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు రాము మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదన్నారు. ముందుగా రైతు సంఘం జెండాను ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఇంకా ఈ సభలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే హుస్సేన్, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, మండపాటి రమణారెడ్డి తదితరులు మాట్లాడారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో వచ్చిన కౌలు రైతులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు ముందస్తు చర్యలు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే నాలుగు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో నూర్పిడి జరుగుతున్న పంటలను రక్షించేందుకు తక్షణమే ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో వరి, శెనగ, మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటలు నూర్పిడి చేసి కళ్లాల్లోనే ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యంగా సాగు కావడం వలన కృష్ణా, బాపట్ల, ఆయకట్టు చివరి భూములల్లో ఆలస్యంగా పంటలు వేయడంతో... ఇప్పుడిప్పుడే వరి పంట నూర్పిడి కొనసాగుతోందన్నారు. నెల్లూరు జిల్లాలో సైతం నూర్పిడి జరుగుతోందన్నారు. గుంటూరు, ప్రకాశం, తదితర రాయలసీమ జిల్లాలో శెనగ పంట నూర్పిడి చేస్తున్నారని, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో మొక్కజొన్న కూడా కళ్లాల్లో ఉందని వివరించారు. నంద్యాల, కర్నూలు, పల్నాడు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలో మిరప పంట కోతలు కోసి కళ్లాలో ఆరబెట్టి గ్రేడ్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో వర్షాలు పడితే రైతాంగం తీవ్రంగా నష్ట పోతారని, ఇప్పటికే సరిగ్గా దిగుబడి రాక వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభించక ఆందోళనలో ఉన్న రైతులు వాతావరణ శాఖ తెలిపిన సమాచారంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని పంటలను రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, పంటను కాపాడేందుకు రైతులకు అవసరమైన టార్పాలిన్ పట్టాలు ఉచితంగా అందించాలన్నారు. పంటలున్న వివిధ ప్రాంతాల్లో రైతులకు తగిన సూచనలు, సలహాలివ్వాలని, సాధ్యమైనవంతవరకు నష్టాన్ని నివారించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
Office of the Commissioner of Distilleries and Breweries
Prohibition and Excise Department - VIJAYAWADA

'e' procurement notice
TENDER Notice No: 29/EeGP/2023 dated 13.3.2023

The Commissioner of Distilleries & Breweries, Prohibition and Excise Department/Andhra Pradesh invites Request for Proposal (RFP) for selection of an agency for design/update, development, maintenance of existing website and providing help desk support etc for a period of 5 years through competitive e-tendering process under Reverse Tendering Mechanism as per the terms and conditions laid down in the RFP Document. All other information related to eligibility criteria, scope of work and terms and conditions, etc, are available in the websites i.e., www.tender.apeprocurement.gov.in and also in www.apsbcl.ap.gov.in.

For any further clarifications, please contact:
Accounts Officer (Tenders),
Mail Id: cdbhyderabad@gmail.com, Phone: 9030517221.

Address: The Commissioner of Distilleries & Breweries
Prohibition and Excise Department,
Excise complex, 68-2B, Kollafarum Road, SER Center,
Prasadampadu, Vijayawada, Andhra Pradesh 521108.

సంపాదకీయం

కొత్తసీసాలో చీప్‌లిక్కర్

కడతేరని కష్టాలెన్ని ఉన్నా..రాష్ట్రం పీకల్లోతు ఊబిలో కూరుకుపోయినా..అప్పులోళ్లు ఊపిరిసలపని విధంగా నెత్తిపై కూర్చొని నాట్యమాడుతున్నా...ముఖంపై బలవంతంగా నవ్వు పులుముకొని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత మాత్రం బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిదే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబడ్జెట్‌ను నాలుగేళ్లలో ఐదో బడ్జెట్‌ను ఐదోసారి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఘనుడాయన. అదృష్టవశాత్తు, స్పీకర్ తమ్మినేని సీతారాం శాసనసభ వ్యవహారాల ప్రత్యక్ష ప్రసారాలను మధ్యలో అధికారికంగా ఆపివేశారు కాబట్టి బతికిపోయాం. లేకుంటే, 'బుగ్గన లెక్కలు-జగన్ నవ్వులు' ఆసాంతం తనివితీరా ఆంధ్రా ప్రజలు ఆస్వాదించలేక చచ్చేవాళ్లు. బడ్జెట్‌లో ఎక్కడా కొత్తదనం కన్పించదు, అంతా అంకెలగారడీ, గణాంకాల మాయ.. అసత్యాల చిట్టా..నాలుగేళ్లూ చెప్పిందేచెప్పి చెప్పిందేచెప్పి విసిగించి జనం ప్రాణాలు తోడేస్తున్నా..ముఖ్యమంత్రి వెనుక కూర్చున్న ఎమ్మెల్యేలు మాత్రం బల్లలు చరుస్తూనే వున్నారు. ఎందుకు చరుస్తున్నారో ఎవరికీ అర్థం కాదు, వారి రాక్షసానందం ఏంటో అంతుపట్టదు. బడ్జెట్‌లో ఏమీ లేదనుకున్నప్పుడు పాతసీసాలో కొత్తసారాఅని చెపుతూవుంటారు. కానీ ఈసారి జగన్ ప్రభుత్వం ఎంతో భిన్నంగా సీసామార్చింది. కాకపోతే అందులో చీప్‌లిక్కర్ పోసింది. స్థూలంగా ఇదీ మన రాష్ట్రబడ్జెట్ 2023-24.

పాపం బుగ్గనకు అమరావతి ఎప్పుడూ కొత్తే. ఎందుకంటే ఆయన అసెంబ్లీ సమావేశాల సమయంలో, ముఖ్యంగా బడ్జెట్ సమయంలో తప్ప మిగతా కాలంలో ఢిల్లీ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ వుంటారు. ఇంత చేసి 9 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి పోగేసినా, ఈసారి రూ.2,79,279 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ఆనందపడాలా? అప్పులో ఇంకా 6 లక్షల కోట్లు మిగిలిపోయినందుకు బాధపడాలా? జగన్ సర్కారులోని మంత్రులంతా అబద్దాలను అందంగా చెప్పడంలో ఆరితేరిపోయారు. పైగా బుగ్గన గారు ఒకడుగు ముందుకేసి 'కల అంటే నిద్రలో వచ్చేది కాదు..నిద్రపోకుండా చేసేది' అంటూ కలాం గారి కొటేషన్‌ను సభలో చెప్పి బీభత్సంగా చప్పట్లు కొట్టించుకున్నారు. 2022-23లో ఒక్క రోడ్డు వేయలేదు, ఒక్క ప్రాజెక్టులోనైనా కనీసం ఒక్క పార మట్టి ఎత్తిపోయలేదు, ఒక్క కాలేజీ కట్టలేదు, ఒక్క ఆసుపత్రి బాగుచేయలేదు, ఒక్క ఉద్యోగికీ సకాలంలో జీతం ఇవ్వలేదు. ఆ సమయంలో రెవిన్యూ లోటు రూ.29,107 కోట్లు, ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు. ఇబ్బడి ముబ్బడిగా తెచ్చిన అప్పులేమైనట్లు? రాష్ట్ర ఆదాయం ఏమైనట్లు? పోనీ నవరత్నాలకేమైనా భారీగా ఖర్చుపెట్టారా అంటే అందులో ఐదు రత్నాలే నవనవలాడుతున్నాయి. మిగిలిన నాలుగు రత్నాలు పేలవంగా మారి, మసకబారిపోయాయి. పది వైఎస్సార్ పథకాలకు, మరో పది జగనన్న పథకాలకూ సుమారు 55 వేల కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే అమ్మఒడిని, ఆసరాను, కళ్యాణమస్తులను ఒక ఏడాది చొప్పున మింగేశారు. ఈ పథకాల లబ్ధి ఈసారి కొందరికైనా చేరుతుందని ఆశించాలి. అది కూడా ప్రభుత్వం విధించిన షరతులన్నింటినీ పాసవ్వాలి. సరికదా, ఈ నిధులను డీబీటీ ద్వారా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకే డబ్బులు ఇస్తున్నామని ఎన్నేళ్లు చెపుతారు? అసలు అందులో చాలా రంగాలకు కేంద్రం నుంచి నిధులు వస్తాయి. ఆ నిధుల శాతాన్ని వీరి లెక్కల్లో చూపించే నైతికత ప్రభుత్వానికి వుందా? కేంద్ర నిధులను దారిమళ్లించి, 'వైఎస్సార్, జగనన్న' పథకాల్లోకి నెట్టేసి జనం మనోభావాలతో ఎన్నాళ్లు ఆడుకుంటారు? మోదీకి మొక్కీమొక్కీ మ్యాచింగ్ గ్రాంట్లకు దిక్కేలేకుండా చేశారు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి 7శాతం దాటిన పాపానపోలేదు. కానీ దాదాపు 14శాతం జీఎస్‌డీపీని చూపించుకుంటూ వున్నారు. అప్పులు పుట్టించుకోవడానికి ఇంతకు బరితెగించాలా? అసలు అప్పుల్లో ప్రత్యక్షమెంత? పరోక్షమెంత? వాటిపై శ్వేతపత్రం ప్రకటించే దమ్ము సర్కారుకుందా? ప్రతియేటా పేరుకే లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపులు ప్రకటించడం, వాస్తవానికి నాలుగవ వంతు కూడా ఖర్చుపెట్టకుండా ఉండటం జనాన్ని మోసం చేయడం కాదా? 6,81,000 ఉద్యోగాలు కల్పించినట్లు ప్రకటించి జబ్బలు చరుచుకున్నారు. నలుగురూ నవ్విపోరా! నాలుగేళ్లలో రాష్ట్రంలో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? గ్రామ సచివాలయ సిబ్బంది తప్ప! పేదలందరికీ ఇళ్లు పథకం కింద రూ.5,600 కోట్లు కేటాయించారు. చాలా సంతోషం! గత నాలుగేళ్లూ అటుఇటుగా ఇవే లెక్కలు చూపించారు. రాష్ట్రంలో ఒక్క లబ్ధిదారుడైనా సొంత ఇంటిలోకి అడుగుపెట్టి, గృహప్రవేశం పేరుతో నలుగురికి పప్పన్నం పెట్టి సంబరం చేసుకున్న సందర్భం వుందా? ఈ స్కీము అతిపెద్ద స్కాము అని ఏనాడో అర్థమైపోయింది.

కులాల పేరుతో 54 కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని హర్షధ్వానాల నడుమ అసెంబ్లీలో చెప్పుకున్నారు. ఇదంతా 'పదవుల పందేరం'లో జరిగిన ఒక తంతు తప్ప ఆ కార్పొరేషన్ల కింద ఒక్కరికైనా స్వయం ఉపాధి కల్పించిన దాఖలాలు వున్నాయా? ఈ కార్పొరేషన్ల చైర్మన్లు ఎర్రబుగ్గ కార్లేసుకొని దందాలు చేసుకోవడం తప్ప తమ కులపోళ్లకు ఒక్క పైసా అయినా మంజూరు చేయించారా? ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ ప్రశ్నలకు బడ్జెట్‌లో ఒక్క సమాధానం కూడా లేదు.

సాధారణ బడ్జెట్ నుంచి వ్యవసాయ బడ్జెట్‌ను వేరుగా ప్రతిపాదించడం గొప్ప కాదు. మంచి కేటాయింపులతో, అభివృద్ధి చూపించి మీసం మెలేస్తే జగన్ ప్రభుత్వాన్ని చూసి హర్షించేవారు. రూ.41436.29 కోట్లతో వ్యవసాయ అనుబంధ బడ్జెట్‌ను అరకొరగా ప్రతిపాదించి, చేతులు దులిపేసుకున్నారు. నీటి వనరుల అభివృద్ధికి కేవలం రూ.11,908 కోట్లు మాత్రమే కేటాయించి వ్యవసాయాన్ని, సాగునీటి రంగాన్ని మరోసారి అవమానించారు. బడ్జెట్‌లో కనీసం 15శాతం నిధులను నీటిపారుదల రంగానికి కేటాయిస్తే, పోలవరం సహా పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టుల్లో కాస్తయినా కదలిక వుండేది. కానీ ఈనాడు కేవలం 5శాతం నిధులు కేటాయించి, ఆ రంగంపై జగన్ నిర్లక్ష్య ధోరణిని మరోసారి ప్రదర్శించారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.3000 కోట్లు కేటాయించారు. గతంలోనూ ఇదే జరిగింది. కానీ ధరలు సామాన్యుడి నడినెత్తిన నరకం చూపిస్తున్నాయి. అంటే ఇవన్నీ కాగితాలకే పరిమితమన్నది విస్పష్టం. అవసరంలేని గడప గడప కార్యక్రమానికి రూ.530 కోట్లు ఎందుకు కేటాయించారో సర్వవిదితమే.

కొసమెరుపు ఏమిటంటే, బడ్జెట్ సమావేశాల్లో మీడియాకు బడ్జెట్‌కు సంబంధించిన ముద్రిత ప్రతులను ఇచ్చేవారు. ఈసారి చేతులెత్తేశారు. అంతేకాదు, బడ్జెట్ ప్రసంగానికి సంబంధించిన తెలుగు, ఆంగ్ల విభాగాలను ఒకే పుస్తకంలో కలిపి సమగ్ర విశ్లేషణ కోసం అందరికీ పంపిణీ చేసేవారు. ఈసారి ఒకే పుస్తకాన్ని రెండుగా, బహిరంగంగానే చించి ముక్కలు చేసి తెలుగు మీడియాకు తెలుగు పేజీలను, ఆంగ్ల మీడియాకు ఆంగ్ల పేజీలను అందజేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దౌర్భాగ్య పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు. హ్యాట్సాఫ్ టు జగన్ సర్కార్!

జూలో మనిషి

రా బావ ఏంటి ఈ రోజు చాలా కోపంగా విసుగ్గా కనబడుతున్నావు. చాలాకోపంగా ఉన్నట్లున్నావు ముందు కాఫీతాగు తర్వాత మాట్లాడుకుందాం. ఇప్పుడు చెప్పు ఏంటి కథ. ఏంటి చెప్పేది అసలు మనిషివేనా. నేను మాత్రం మనిషినికాదు జంతువుకంటే హీనం. ఉన్నట్లుండి ఇంత కఠోరంగా మాట్లాడడానికి కారణంఏంటి. ఏం చెప్పాలి పంజరంలో చిలుక, బోనులో ఎలుక, ఇంట్లో నేను, పక్షులు ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. జంతువులు అడవిలో హాయిగా తిరుగుతున్నాయి. రోడ్డుమీద కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. కానీ ఆకాశాన్నంటి విశ్వాన్ని శోధించిన మనిషికి స్వేచ్ఛ లేదు. లక్షల మంది ప్రాణాలర్పించి స్వాతంత్ర్యంపొందాం. ఇక నుండి మనల్ని మనమే పాలన చేసుకుని మన సమస్యలు మనమే పరిష్కరించుకుంటాం. ఇక మనది ప్రజాస్వామ్యదేశం అన్నారు ఆనాడు గాంధీ, నెహ్రూలు. అవును ఇప్పడే ముంది నీకు, నాకంటావేంటి? నీకు వాక్ స్వాతంత్ర్యం ఉందా. నీ మాటకు సమాజంలో విలువుందా. ఒకప్పుడు కమ్యూనిస్టు దేశాల్లో స్వేచ్ఛ లేదన్నారు. ఇక్కడుందా. ప్రస్తుతం బిజేపీ పాలనలో మనిషికి స్వేచ్ఛ ఉందా. స్వేచ్ఛ లేక వ్యక్తిత్వంకోల్పోయిన మనిషి జంతువుతో సమాన మన్నాడు వావిలాల. అందుకే ఆయన ఏపార్టీలో చేరలేదు. అయినా ఆయన తనవ్యక్తిత్వం కోల్పోకుండానే ఏ రాజకీయపార్టీ అండలేకుండానే

పద్మవిభూషణ్ సాధించాడు. అందుకే మనకు మాత్రం పార్టీలు అవసరమా. భలే వాడివి బావ అయిపోయిందా ఇంకా ఉందా ఏంటి నీకు ఎగతాళిగా ఉందా, నీకు తెలుసుగా కొన్నాళ్లు ఉద్యోగం వెలగబెట్టా ఆ తరువాత రాజకీయాల్లో తిరిగా, ఆ తరువాత సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టా. ఆ తరువాత పత్రికా రంగంలో పనిచేస్తున్నా కానీ నా కెక్కడా స్వేచ్ఛ కనబడలా. నిజమే బావ ప్రజాస్వామ్యం పేరిట అప్రజాస్వామ్య పాలన అనేకంటే ప్రస్తుతం నియంతపాలన సాగుతోంది. ప్రజాస్వామ్య దేశాల్లో చాలా చోట్ల ఇలా జరుగుతున్నా అన్నింటిని మించి నియంత పాలన మన దేశంలోనే సాగుతోంది. స్వేచ్ఛలేని మనిషి జంతువుతో సమానం. అవి అడవుల్లోనన్నా స్వేచ్ఛగా తిరుగుతాయి. ఆ పాటి స్వేచ్ఛ మనకులేదు. దేనికంటే రాజులపాలన, ఆ తరువాత ఆంగ్లేయుల పాలన ఎరుగని పెద్దలు అంటున్నారు. అవి సరే బావ నువు, నేను పల్లెల్లో బతికి పట్టణానికి చేరాం. మన చిన్నతనంలోన పల్లెల్లో ఉన్న స్వేచ్ఛ ఇపుడు అక్కడకూడా లేదు. రాజకీయాలు గ్రామాలకు, వార్డులకు చేరిపోయి నందున అక్కడ కూడా రాజకీయ కక్షలతో కత్తులతో నరుక్కోవడం చూస్తున్నాం. విచ్ఛిన్నమైన కుటుంబాలవల్ల వృద్ధాప్యంలో కనిపెంచిన బిడ్డలు వాళ్ల దగ్గర లేక వృద్ధాశ్రమాలు వెతుక్కోవడం చూస్తున్నాం.

ఇటువంటి దుర్భర పరిస్థితి వస్తుందని మనం ఊహించలేదు. అది సరే రాజకీయ కాలుష్యం వల్ల గ్రామాల్లో సైతం వర్గవిభజన జరుగుతుంది. కుల,మత,వర్గరహిత సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఇంకా ముందుకెళ్లి రామరాజ్య స్థాపనకోసమై పోరాటమన్నారు ఆరోజు గాంధీ, నెహ్రూలు. కాని ప్రస్తుతపాలన అందుకు భిన్నంగా మోదీ,షాలు సాగిస్తున్నారు. నిజమే వారిని గద్దెదించడానికి వామపక్షపార్టీలు సై అన్నా కొన్ని రాష్ట్రాల నాయకులు ముందుకు రావడం లేదుకదా, అది నిజమే ప్రస్తుతం పార్టీ లేకుండా ఒంటరిగా ఒక మంత్రిని కలువలేదు. కానీ పార్టీలు దిగువ మనిషిని పట్టించుకోవడం లేదు. వ్యక్తిగతంగా నా మనో భావాలు వెల్లడించే స్వేచ్ఛలేదు. ఒంటరిగాచెప్పినా అవి పత్రికలలో రావు. పార్టీలు, సంఘాలు సంస్థల్లో ఎందులోనూ స్వేచ్ఛలేదు. ఈ పరిస్థితిల్లో ఏం చేయాలో అర్థం కావడంలేదు. స్వేచ్ఛలేని బతుకు నేను బతకలేను. ఆగు బావ అంతగా ఆలోచించకు. మన కంటే మేధావులు ఎక్కువ బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారు. సమస్యకు చావు పరిష్కారం కాదు. మీరేం చేయాలి. ప్రజాస్వామ్యవాదుల్ని అభ్యుదయ రచయితల్ని అణచివేసింది. బీజేపీ ప్రభుత్వం ఆ స్థితిలో ఏం చేయాలో చెప్పు. భారతీయులు శిశుపాలుని విషయంలో శ్రీ కృష్ణుడు లెక్క పెట్టినట్లు ఈ బీజేపీ చేసే తప్పుల్ని కూడా ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఒక కూటమిగా ఏర్పడకపోయినా వీరిని కూడా పట్టించుకోకుండా తమ ఓటు ద్వారా చరమగీతం బీజేపీకి పాడుతారు. ఏమో నువు ఎన్నిచెప్పినా వ్యక్తిత్వం చంపుకుని నేను జూలో జంతువులాగ ఇంటికిపరిమితమై బతకలేను. ఆగవయ్యా నీలాగానే ఆలోచించి నక్సలైటుగా మారి ఎందరో యువకులు చనిపోతున్నారు. కర్ణుని చావుకు వంద కారణాలన్నట్లు వీరికి కూడా టైము దగ్గర పడుతుంది. ఏమో నాకు నమ్మకం కుదరడంలేదు. ఎంతో క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు పార్టీల ఏలుబడిలో ఉన్న బీజేపీ మతచిచ్చు రగిలిస్తే స్థానికులు కులచిచ్చు రగిలిస్తున్నారు. బెంగాల్, త్రిపురలో కూడా వారి చేయి జారిపోయాయి. ప్రస్తుతం ఆప్‌పార్టీ నేతలను కేసుల్లో ఇరికించి ఢిల్లీ, పంజాబులలో కూడా ప్రవేశించి దుర్మార్గపు క్రీడ మొదలుపెట్టారు. అదే నే చెప్పేది. నీకొక్కడికే కాదు రాష్ట్రాన్ని పాలించే నేతలు కేసుల వల్ల జైలు పాలవుతున్నారు. అది సరే ఇలా జరగడానికి కారణమేమిటంటావు. ఏముంది ప్రతిపార్టీలో ఎవరో ఒకరు స్వార్థం కొద్దీచిన్న తప్పు చేస్తే దానివల్ల పార్టీ నాశనమవుతోంది. ఇప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ లేదన్న వావిలాల పత్రికలలో స్వేచ్ఛ లేదన్న నార్ల అందుకు మరణం శరణ్యమని వారనుకోలేదు. వారు ఎంచుకున్న దారిలో తుదివరకు ప్రయాణించారు. నువు వ్యక్తిగతంగా ఏం చేయగలవని ఆలోచించు. నియంతృత్వ పాలన గురించి నువు పదిమందికి చెప్పి ఒక్కక్కరు పదిమందిని చేర్చేట్లు చూడు. ఇలా కొంతకాలానికైనా ప్రజల్లో మార్పువచ్చి ఓటును సద్వినియోగం చేస్తారు.

సెల్: 98855 69394

మోదీ-షాలకు కర్ణాటక ఎన్నికల గుబులు

అరుణ్ శ్రీవాత్సవ

ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్న విశ్వాసంతో కాంగ్రెస్ నాయకత్వం పనిచేస్తోంది. సాధారణంగా ముస్లింలు ఎప్పుడూ కాంగ్రెస్‌కే ఓటు వేస్తున్నారు. ఈసారి ఎంఐఎమ్ అభ్యర్థులు పోటీచేస్తే, కాంగ్రెస్‌కు వచ్చే ఓట్లు తగ్గిపోతాయన్న అంచనాఉంది. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్ర ప్రభావం గణనీయంగా ఉందని భావిస్తున్నారు. మీ ఓట్లు సావర్కర్‌కా, టిప్పుసుల్తాన్‌కా అంటూ మతాల మధ్య చిచ్చు రేపడానికి, తద్వారా హిందువుల ఓట్లను పదిలపరచు కునేందుకు బీజేపీ ప్రచారం సాగిస్తోంది. ఈ ప్రచారం కారణంగా మత ఘర్షణలు, అరాచకం చోటుచేసుకున్నాయి. వీటికి బీజేపీ దేశంలో ప్రతీకగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని ప్రయోజనం పొందడంలో బీజేపీదే పైచేయి. నిధులు ఎన్నయినా ఖర్చు చేయగల సామర్థ్యం బీజేపీకే ఉంది.

మరో నెలన్నరలో జరగనున్న కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల మనసుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. మోదీ 45 రోజుల్లోనే ఇప్పటికి మూడుసార్లు కర్ణాటకలో పర్యటించారు. సంఘ్‌పరివార్ కార్యకర్తలు అన్నిటినీ సిద్ధంచేసి ఉంచారు. రెండు నెలలుగా ఈ రాష్ట్రంపైనే బీజేపీ కేంద్రీకరించింది. రాష్ట్రంలో మోదీ మరో డజనుసార్లు పర్యటించనున్నారని తెలుస్తోంది. అమిత్‌షా దాదాపు నెలరోజులుగా ఇక్కడే తిష్టవేసి రాష్ట్ర బీజేపీలో చోటుచేసుకున్న అంతర్గత కలహాలను సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. మోదీకి రాష్ట్ర అసెంబ్లీలో గెలిచినా, గెలవకపోయినా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మూడవసారి ప్రధాని కావాలన్న తహతహ బాగా పెరిగింది. ప్రథమ ప్రధాని నెహ్రూ వరుసగా మూడుసార్లు ఎన్నికై ప్రధాని అయ్యారు. ఆయనతో పోటీ పడాలన్నదే మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకనే మధ్యతరగతిని ఆకర్షించేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్, మేఘాలయాల అసెంబ్లీ ఎన్నికల్లో తామే గొప్ప విజయం సాధించినట్లుగా ప్రచారం చేసుకుంటున్న మోదీ గొప్ప మాటలమారి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ మోదీ, షాలు లెక్కలేనన్నిసార్లు పర్యటించి అనేక రోడ్‌షోలు నిర్వహించినప్పటికీ మేఘాలయలో 60సీట్లకు గాను 58 సీట్లలో బీజేపీ డిపాజిట్ కోల్పోయింది. త్రిపురలో గతంలో వచ్చిన సీట్లకంటే ఈసారి 11సీట్లు తగ్గాయి. నాగాలాండ్‌లో 2సీట్లు దక్కాయి.

కర్ణాటకలో లింగాయత్తులపై గట్టిపట్టుఉన్న మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను రాష్ట్ర బీజేపీ వ్యవహారాల నిర్వాహకుడిగా మోదీ ఎంపికచేసి ఎన్నికల్లో విజయం సాధించాల్సిన బాధ్యతను అప్పగించారు. ఇది జరిగిన 15రోజుల్లోనే సీను మారింది. ఎన్నికల నిర్వహణ బాధ్యత అంతా ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయ్ చేతికివెళ్లింది. అంతర్గత కలహాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. యడియూరప్పకు, బొమ్మయ్‌కు సంబంధాలు దాదాపుగాలేవు. బొమ్మయ్ రాష్ట్ర ఎన్నికల ప్రచారకమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. యడియూరప్పపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయనపై గతంలోఉన్న ఆదరణ తగ్గిపోయింది. బొమ్మయ్ కూడా లింగాయెత్తే. ఈ వర్గంపై యడియూరప్పకు ఉన్న పట్టు బొమ్మయ్‌కు లేదు. యడియూరప్పకు బాధ్యత అప్పగిస్తే మరో వెనుకబడిన కులం ఒక్కలిగ కూడా బీజేపీవైపు రావచ్చునన్న ఆశతో మోదీ ఆయనను ఎంపిక చేసుకున్నారు. మోదీ ఎంపికకు కూడా విలువలేకుండాపోయింది. ఇప్పుడు బీజేపీలో అంతర్గత సంక్షోభం ముదిరింది. ఒక్కలిగల ఓట్లను పొందడంకోసం వారిలో పలుకుబడికలిగిన కాంగ్రెస్, జేడీ(ఎస్) పార్టీల నుంచి కొందరు నాయకులను తమ పార్టీలో ఎలాగైనా చేర్చుకోవాలని మోదీ,షాలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు పరిస్థితి ఓటర్లలో గణనీయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిమయమైందని, ప్రజలకు ఎలాంటి ప్రయోజనకరమైన కార్యకలాపాలు నిర్వహించలేదన్న అభిప్రాయంతో వారిలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలేమీ ఫలించడంలేదు.

దాదాపు 15 రోజుల క్రితం రాష్ట్ర బీజేపీ నాయకుడు కటీల్ టిప్పు సుల్తాన్‌పైన దుర్మార్గమైన వ్యాఖ్యలు చేశారు. ఆ తరువాత మరో సీనియర్ నాయకుడు ఈశ్వర్ ముస్లింల ప్రార్థనలపైన తీవ్రమైన వ్యాఖ్యలుచేసి వారి ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారు. ముస్లింలప్రార్థన రోజూ తలనొప్పిగా మారిందని, లౌడ్ స్పీకర్‌లు చెవుడు తెప్పించేట్లుగా ఉంటున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర నాయకులు పార్టీని నడిపించి, గెలిపించే బాధ్యత మోదీనే అన్నట్లుగా ఉంటున్నారు. రెండురోజుల క్రితమే మాండ్య, హుబ్బళి, ధార్వాడ్ జిల్లాలలో 16వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేసివెళ్లారు.

ఈ సందర్భంగా జరిగిన సభల్లో తాను అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని చెప్పుకున్నారు. పైగా కాంగ్రెస్ తనకు సమాధి కట్టాలని అంటోందని వ్యాఖ్యానించారు. బెంగళూరు-మైసూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను మోదీ ప్రారంభించారు. ఆయన శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మాజీ ప్రధాని జేడీ(ఎస్) నాయకుడు హెచ్‌డి దేవగౌడకు మంచిపట్టుఉంది. అలాగే కాంగ్రెస్‌కు కూడా గణనీయమైన పలుకుబడిఉంది. మాండ్య, మైసూర్, చామ్‌రాజ్ నగర్‌ప్రాంతాలలో బీజేపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ బళ్లారి రెడ్డి సోదరులు స్వంత పార్టీ (కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష) ఏర్పాటు చేసుకున్నందున బీజేపీకి పెద్దగా ఫలితం ఉండదు. పైగా ఈ ప్రాంతంలో బీజేపీని ఓడించి తీరుతామని ఆ పార్టీపై ఆగ్రహంగాఉన్న జనార్థన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీచేయిస్తామని జనార్థన్‌రెడ్డి చెప్పారు. ఆయనపైన తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. జైలుశిక్ష కూడా అనుభవించారు. గత మూడు సంవత్సరాల్లో మత ఘర్షణలు రాష్ట్రంలో రెట్టింపయ్యాయి. ముస్లింలపై వేధింపులు తీవ్రంగా జరిగాయి. శివమొగ్గలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలోనే పెద్ద ఎత్తున మతఘర్షణలు చోటుచేసుకున్నాయి. హిందువుల మనోభావాలను గెలుచుకునేందుకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థపై బీజేపీ నిషేధం విధించింది. ఈ చర్య బీజేపీకే ఎదురుదెబ్బ అయింది. 2022లోనే దాదాపు 22చోట్ల మతఘర్షణలు జరిగాయి. వీటికి బీజేపీనే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంఐఎమ్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ తమ పార్టీ 30చోట్ల పోటీచేస్తుందని ప్రకటించి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిని మరింత క్లిష్టం చేశాడు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చే పనులు ఆయన చేస్తాడన్న ఆరోపణ ఉంది.

ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్న విశ్వాసంతో కాంగ్రెస్ నాయకత్వం పనిచేస్తోంది. సాధారణంగా ముస్లింలు ఎప్పుడూ కాంగ్రెస్‌కే ఓటు వేస్తున్నారు. ఈసారి ఎంఐఎమ్ అభ్యర్థులు పోటీచేస్తే, కాంగ్రెస్‌కు వచ్చే ఓట్లు తగ్గిపోతాయన్న అంచనాఉంది. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్ర ప్రభావం గణనీయంగా ఉందని భావిస్తున్నారు. మీ ఓట్లు సావర్కర్‌కా, టిప్పుసుల్తాన్‌కా అంటూ మతాల మధ్య చిచ్చు రేపడానికి, తద్వారా హిందువుల ఓట్లను పదిలపరచు కునేందుకు బీజేపీ ప్రచారం సాగిస్తోంది. ఈ ప్రచారం కారణంగా మత ఘర్షణలు, అరాచకం చోటుచేసుకున్నాయి. వీటికి బీజేపీ దేశంలో ప్రతీకగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని ప్రయోజనం పొందడంలో బీజేపీదే పైచేయి. నిధులు ఎన్నయినా ఖర్చు చేయగల సామర్థ్యం బీజేపీకే ఉంది.

కన్నూ-వేలూ సీమవే!



వి. శంకరయ్య

రాయలసీమ నేడు వలసల సీమగా మారిపోయింది. ఈ ప్రాంతం దుర్గతికి చేరింది. ఇదివరకటికంటే మరీ వెనుకబడిన ప్రాంతంగా చెప్పే తెలంగాణలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిల ఆ మధ్య పాదయాత్రచేస్తూ పొలంలో పనిచేస్తున్న కూలీల బాగోగులు తెలుసుకొనేందుకు వెళ్లి పలకరించగా తాము ఉపాధి లేక రాయలసీమ నుండి వచ్చిన వలస కూలీలమని చెప్పినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. ఇదీ నేటి దుర్గతి..తొలి రోజుల్లో సీమ పరిరక్షణ కోసం పప్పూరి రామాచార్యులు కడప కోటిరెడ్డి, కల్లూరు సుబ్బారావు లాంటి వారు చిత్తశుద్ధితో చేసుకొన్న శ్రీబాగ్ ఒడంబడికను తదుపరి వచ్చిన నేతలకు తమ స్వార్థ రాజకీయానికి ఒక ఉపకరణంగా మార్చుకున్నారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయంలో కర్నూలు రాజధాని చేశారు. అంత వరకు బాగానే వుంది. ఇప్పుడు సీమ ప్రాంతంలో ఏకపక్షంగా గెలిచిన వైసీపీ శాసన సభ్యులు వున్నా రాజధాని, న్యాయరాజధాని కాదుకదా? అందరూ ఏక కంఠంతో కోరుతున్న కృష్ణా యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో పెట్టలేదు. 1953లో శ్రీ బాగ్ ఒడంబడిక పేరుతో కర్నూలు రాజధానిగా చేసిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నపుడే (కృష్ణా పెన్నార్ పోయింది) దాని స్థానంలో సిద్దేశ్వరం బహుళార్థ సాధక ప్రాజెక్టు తోసిపుచ్చి శ్రీ శైలం జలాశయం కేవలం జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుగా నిర్మించినందున బచావత్ ట్రిబ్యునల్ 1969లో నిర్మాణంలో వున్న సాగునీటి ప్రాజెక్టులకే నీటి కేటాయింపులు చేశారు. ఫలితంగా శ్రీశైలం జలాశయంలో రాయలసీమకు చుక్క నీరు కేటాయించలేదు. శ్రీ బాగ్ ఒడంబడిక చేసుకున్న సమయంలో అనంత పురంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రెండవ కేంద్రం పెట్టాలని తొలి అంశం గానూ, తదుపరి అంశంగా సాగునీటి ప్రాజెక్టులకు ఆనాటి పెద్దలు ప్రాముఖ్యత ఇచ్చారు. లక్షలాది ప్రజల క్షేమం దృష్టిలో పెట్టుకున్నారు. నాల్గవ అంశంగా రాజధాని హైకోర్టుల గురించి షరతులు పెట్టారు. కాని గొంతెండిపోతున్న లక్షలాది ప్రజలకు ఉపాధి సామాజిక న్యాయం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం నీటి వాటా పక్కకు నెట్టేసి నేతల రాజకీయావసరాలకు అనువుగా అప్పుడూ ఇప్పుడూ భావోద్వేగాల నాల్గవ అంశం రాజధాని తెరపైకి తెచ్చారు. సిద్దేశ్వరం బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మించి వుంటే జారిపోయిన కృష్ణా పెన్నార్ ప్రాజెక్టుతో సాగునీరు లభ్యమయ్యే మొత్తం ఆయకట్టుకు ఆనాడే నీటివసతి ఏర్పడి వుండేది. 1955లో సాగర్‌కు శంకుస్థాపన జరిగితే 1956లో నీలం సంజీవరెడ్డి పనులు ప్రారంభించారు. మధ్యలో కోస్తా వాళ్లను నిందించడమెందుకు? ప్రాంతీయ విద్వేషాలు ఎంతకాలం వుంటే అధికారం కోరుకొనే నేతలకు అంత ఉపకారంచేసి పెడుతుంది. 1953 నుండి ఇప్పటి వరకు సీమనుండే ముఖ్యమంత్రులు ఎక్కువమంది వున్నారు. ఇప్పుడు విశాఖకు రాజధాని తరలించే సీమకు చెందిన జగన్మోహన్ రెడ్డిని కోస్తా వాళ్ళు ప్రభావితం చేస్తున్నారా?

1976, 1977 సంవత్సరాల్లో కృష్ణా బేసిన్‌లోని మూడు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం దస్త్రాలకే పరిమితమై వుంటే 1983లో ఎన్టీఆర్ అధికారంలోనికి వచ్చిన తర్వాత తెలుగుగంగ పథకం తెరమీదకు వచ్చింది. ఈ సందర్భంలోనే మిగులు జలాల ఆధారంగా మరొక మూడు పథకాలకు శ్రీరామ కృష్ణయ్య శ్రీకారం చుట్టారు. అయితే మిగులు జలాలు కాకుండా నికర జలాలు కావాలని పెద్దఎత్తున రాయలసీమలో రాజకీయ మిళితమైన ఉద్యమంసాగింది. డాక్టర్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ మైసూరారెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాదయాత్రలు ఆందోళనలు చేశారు. ఆ పాటికే నికర జలాలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు చేసివున్నా ఉద్యమం సాగించారు. తదుపరి 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డాక్టర్ మైసూరారెడ్డి హోం మంత్రిగా కీలక పదవిలో వున్నా 2004లో డా.వైయస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయినా రాయలసీమకు నికరజలాలు ఎందుకు ఇవ్వలేదు? ఉద్యమకారులుగా చేసిన డిమాండ్ అధికారంలోకి రాగానే నెరవేర్చలేకపోయారు. సీమ ఉద్యమ పెడ ధోరణలకు ఇదొక నిదర్శనం. వాస్తవంలో జరిగిందేమంటే డాక్టర్ మైసూరారెడ్డి హోంమంత్రిగా వుండి శ్రీ రామారెడ్డి అనే ఇంజనీర్‌తో గాలేరునగరి పథకం మార్పులు చేయించి నెల్లూరు, చిత్తూరుజిల్లా రైతుల కడుపు గొట్టారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి మాత్రం మిగులుజలాల ఆధారంగా దస్త్రాలకే పరిమితమైన ప్రాజెక్టులను పట్టాల కెక్కించారు. ఆ పుణ్యమే జగన్మోహన్‌రెడ్డికి లాభించింది. తదుపరి 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకొచ్చిన తర్వాత నికరజలాలు కేటాయింపులులేని పట్టిసీమపై పెట్టిన దృష్టి నికరజలాలు కేటాయింపులు వున్న గుండ్రేవుల రిజర్వాయర్‌లేక ఎత్తిపోతలపై పెట్టలేక పోయారు. జగన్మోహన్ రెడ్డిని నిలువరించేందుకు డాక్టర్ రాజశేఖరరెడ్డి కలల ప్రాజెక్టు గండికోట అక్కడినుండి పైడిపాలెం ఎత్తిపోతలతోపాటు ముచ్చుమర్రి పూర్తిచేసేందుకు నిధులు వ్యయంచేశారు. హంద్రీనీవా



కొంతమేరకు పూర్తి చేశారు. కాని పట్టిసీమ జలాలను సీమ పొలాలకు పారిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ప్రకటనలను సీమ ప్రజలు నమ్మలేదు. ఫలితంగా డాక్టర్ రాజశేఖరరెడ్డి వారసత్వం వస్తుందని జగన్మోహన్ రెడ్డికి ఏకపక్షంగా ఓట్లు వేశారు. అయితే నాలుగేళ్ల తర్వాత అంతా భ్రాంతిగా మిగిలిపోయింది.

విషాదమేమంటే చంద్రబాబు నాయుడు హయాంలో చేసిన సమైక్యఆందోళన నేడు కరవైంది. ఇప్పుడు సీమ పరిరక్షణ ఉద్యమంలో వున్న ఒక యువకుడు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఏమీ చేయకున్నా మావాళ్లు ఓట్లు వేస్తారు. చంద్రబాబు నాయుడు పనులు చేసినా ఓట్లు వేయరు అని సామాజికవర్గాన్ని దృష్టిలో పెట్టుకొని కాబోలు నర్మగర్భంగా వ్యాఖ్యానించారు ఆ ధీమాతోనే జగన్మోహన్ రెడ్డి కూడా సీమ ప్రాజెక్టుల గురించి పట్టించుకోవడంలేదు. ఈ ధోరణి మారే వరకు సీమ ప్రజలు ఈ విషవలయంలో తన్నుకు లాడవలసిందే!

టీడీపీ హయాంలో కొందరు ఉద్యమకారులు శవయాత్రలు, ధర్నాలు, నిరసన, ఆందోళనలు నిరాఘాటంగా సాగించారు. ప్రభుత్వం వేపు నుండి నిరోధించిన దాఖలాలేదు. ఇప్పుడు వారే వీధుల్లోకివచ్చి గట్టిగా కేకపెట్టలేకున్నారు. ఈ అనుభవం సీమ యువతపై ఎంతవరకు పనిచేస్తుందో వేచిచూడాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో వుండేది. రాష్ట్ర విభజన తర్వాత రెండురాష్ట్రాల చేతుల్లోకి వెళ్లింది. పైగా కృష్ణా యాజమాన్యబోర్డు ఏర్పడిన తర్వాత పూర్తిగా మారిపోయింది. చుక్కనీరు తీసుకోవాలన్నా దాని అనుమతి అవసరమైన నేపథ్యంలో ఒక్క సిద్దేశ్వరం అలుగు అంశంలోనే కాదు ఇతర అంశాల్లో సీమ ఉద్యమం కొత్త దారులు చేపట్ట వలసివుంది. శ్రీశైలం నుండి 19 టియంసిలు తప్ప అదనంగా తీసుకోలేని పరిస్థితుల్లో నికరజలాలు ఎలా సాధించాలనో ప్రభుత్వం ఆలోచించడంలేదు. దానితో పాటు ఇతర ప్రతిపక్షాలతోపాటు ఉద్యమకారులు ఆలోచించాల్సిన సమయం నేడు నెలకొని వుంది. తీరా విభజన చట్టం సెక్షన్89 కింద విచారిస్తున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు రెండు రాష్ట్రాలకు పంపకానికి మిగిలి వుండేది క్యారీ ఓవర్ కింద మిగిలిన 150 టియంసిలు మాత్రమే. అయితే రెండు రాష్ట్రాల్లో మిగులు జలాల ఆధారంగా వుండే ప్రాజెక్టులకు 400 టియంసిలు అవసరముండటం కొసమెరుపు.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

రెండు నిమిషాలకే వాయిదా

- అధికార-విపక్షాల పోటాపోటీ నినాదాల హోరు
- సాగని ఉభయసభలు
- నల్లరిబ్బన్లు-మాస్కులతో టీఎంసీ నిరసన

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ కోసం విపక్షాలు, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార పక్షం పట్టుపట్టడంతో గురువారం కూడా ఉభయసభలలో వాయిదాలపర్వం కొనసాగింది. లోక్‌సభ, రాజ్యసభ కేవలం రెండు- మూడు నిమిషాలకే మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 2 గంటలకు లోక్‌సభ తిరిగి సమావేశమైందిగానీ అధికార-విపక్షాల పోటాపోటీ నినాదాలతో నిమిషం వ్యవధిలో వాయిదా పడింది. సభ్యులు తన మాటను బేఖాతరు చేయడంతో సభాపతిగా వ్యవహరించిన కిరీట్ సోలంకి సభను వాయిదా వేశారు. బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యల వివాదం తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తొలిసారి పార్లమెంటుకు హాజరయ్యారు. తొలుత తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకొని వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ నేతలు ఆ రాష్ట్రంలో స్కూలు నియామకాల కుంభకోణంపై తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పక్షానికి చెందిన మిగతా సభ్యులు లండన్‌లో చేసిన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. సభ కార్యకలాపాలు జరగనివ్వాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యులను కోరారు. అందరికీ మాట్లాడేందుకు అవకాశమిస్తానని చెప్పారు. 'సభకు వస్తారు... వెల్‌లోకి వెళతారు... ఆపై బయటకెళ్లిపోతారు... మమ్మల్ని మాట్లాడనివ్వలేదని అంటారు... ఇది సరైన పద్ధతి కాదు' అని విపక్ష సభ్యులనుద్దేశించి అన్నారు. అలాగే అధికార పక్ష సభ్యులనూ తమ స్థానాల్లో కూర్చోవాల్సిందిగా సూచించారు. పార్లమెంటు హుందాతనాన్ని కాపాడాలని హితవుపలికారు. కానీ గందరగోళ పరిస్థితులు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు లోక్‌సభను వాయిదా వేశారు. అటు రాజ్యసభ కూడా అధికార, విపక్షాల సభ్యుల పోటాపోటీ నినాదాలతో శుక్రవారానికి వాయిదా పడింది. ఉదయం వాయిదా తర్వాత మధ్యాహ్నం తిరిగి సమావేశమైనప్పుడు సభ్యుల్లో చాలా మంది వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. సభ్యులంతా తమ స్థానాల్లో కూర్చొని సభ కార్యకలాపాలను సాగనివ్వాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సూచించారు. కానీ సభ్యుల నినాదాలు ఆగలేదు. ఉదయం కార్యకలాపాలు మొదలు కాకముందే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. తమను మాట్లాడనివ్వడం లేదని నల్లమాస్కులతో ఆందోళనకు దిగారు. సభ్యులు ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని చైర్మన్ జగదీప్ ధన్కర్ సూచించేలోపే బీజేపీ సభ్యులు రాహుల్ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు మొదలుపెట్టారు. దీంతో కేవలం రెండు నిమిషాల్లో సభ వాయిదా పడింది. బడ్జెట్ రెండవ అంకంలో భాగంగా సోమవారం నుంచి చట్టసభల్లో ఏ అంశంపైనా చర్చ జరిగిందిలేదు. ఉభయసభలు రసాభాస కావడానికి బీజేపీయే కారణమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

ఆరు రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కోవిడ్ కేసులు అనేక రాష్ట్రాల్లో మరోసారి పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాలను కేంద్రం గురువారం అప్రమత్తం చేసింది. ఈ మేరకు వైరస్ నివారణకు చర్యలు చేపట్టాలని లేఖలు రాసింది. కేంద్రం అప్రమత్తం చేసిన ఆరు రాష్ట్రాల్లో కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక ఉన్నాయి. మహమ్మారికి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఇప్పటి వరకు సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకొని ఇన్ఫెక్షన్ నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించింది. రాష్ట్రాలు తప్పనిసరిగా జిల్లాల వారీగా పరిస్థితిపై సమీక్షించాలని, కోవిడ్ ప్రోటోకాల్స్ సమర్థవంతంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. టెస్ట్-ట్రాక్, ట్రీట్-వాక్సినేషన్ వ్యూహాన్ని అనుసరించాలని కోరింది. నాలుగు నెలల తర్వాత దేశంలో గురువారం కోవిడ్ కేసులు అత్యధిక సంఖ్యలో రికార్డయ్యాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు దేశంలో 754 కొత్త కేసులు రికార్డయ్యాయి. గతేడాది నవంబర్‌లో 734 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆ స్థాయిలో కేసులు నమోదవడం ఇదే తొలిసారి. కరోనా మహమ్మారితో కర్ణాటకలో ఒకరు మృతి చెందారు. ప్రస్తుతం దేశంలో 4,633 క్రియాశీల కేసులున్నట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో ఇప్పటివరకు నమోదైన కోవిడ్ కేసుల సంఖ్య 4,46,92,710కు చేరింది. వైరస్ కారణంగా ఇప్పటి వరకు 5,30,790 మంది ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 4,41,57,297కి చేరింది. దేశవ్యాప్తంగా 220.64 కోట్ల వాక్సిన్ డోస్‌లు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ వివరించింది.

కూలిన సైనిక హెలికాప్టర్

ఇటానగర్: అరుణ్‌చల్‌ప్రదేశ్‌లోని వెస్ట్ కామెంగ్ జిల్లా మందల సమీపంలో సైనిక హెలికాప్టర్ చాతీ గురువారం కుప్పకూలినట్లు రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు. హెలికాప్టర్‌లో ఇద్దరు పైలెట్లు ఉన్నారు. లెఫ్టినెంట్, మేజర్‌ను తీసుకెళుతున్న హెలికాప్టర్ ఉదయం 9 గంటలకు బయలుదేరింది. ఉదయం 9.15 గంటలకే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) నుంచి హెలికాప్టర్‌కు సంబంధాలు తెగిపోయాయని లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ చెప్పారు. బొండిలకు పశ్చిమంగా మందల వద్ద హెలికాప్టర్ కూలిపోయిందని, గాలింపు కోసం సహాయబృందాలను పంపినట్లు రావత్ తెలిపారు. దిరాంగ్‌లో కూలిన విమానానికి మంటలు అంటుకున్నట్లు గ్రామస్తులు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌పీ రోహిత్ రాజ్‌బిర్ సింగ్ చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలోనూ హెలికాప్టర్ దహనమవుతూ కనిపించినట్లు గ్రామస్తులు చెప్పారన్నారు.

సిసోడియాపై ఢిల్లీ ఫీడ్‌బ్యాక్ కేసు

దీర్ఘకాలం జైల్లో ఉంచేందుకే: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఒకదాని తర్వాత ఒకటిగా ఆయనపై కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ మద్యం కేసు, మనీలాండరింగ్ వ్యవహారాల్లో సీబీఐ, ఈడీ ఆయనను అరెస్టు చేయగా తాజాగా ఢిల్లీ ఫీడ్‌బ్యాక్ యూనిట్‌లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో మరొక కేసును సీబీఐ పెట్టింది. అప్పట్లో విజిలెన్స్ కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారి సుకేశ్ కుమార్ జైన్, ముఖ్యమంత్రికి ప్రత్యేక సలహాదారు, ఫీడ్‌బ్యాక్ యూనియట్ సంయుక్త డైరెక్టర్, సీఐఎస్‌ఎఫ్ రిటైర్డ్ డీఐజీ రాకేశ్ కుమార్ సిన్హాపైనా అభియోగాలు మోపింది. అలాగే ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ సంయుక్త డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ పంజ్ (ఫీడ్‌బ్యాక్ యూనిట్‌కి డిప్యూటీ డైరెక్టర్), ఫీడ్‌బ్యాక్ యూనిట్‌లో అధికారి, సీఐఎస్‌ఎఫ్ రిటైర్డ్ సహాయ కమాండెంట్ సతీశ్ క్షేత్రపాల్‌తో పాటు కేజ్రీవాల్‌కు అవినీతి వ్యతిరేక సలహాదారు గోపాల్ మోహన్‌పైనా ఈ కేసు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ఐపీసీలోని 120-బీ, 403, 409, 468, 471, 477ఏ సెక్షన్లతో పాటు అవినీతి నిరోధక చట్టం కింద సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. తాజా పరిణామంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ 'సుదీర్ఘకాలం పాటు సిసోడియాను కస్టడీలో ఉంచడమే ప్రధాని ప్రణాళిక. ఇది దేశానికి ఎంతో విచారకరమైన విషయం' అని ట్వీట్ చేశారు.

జంతర్ మంతర్ వేదికగా పెరిగిన ఆందోళనలు

2022నాటి అధికారిక డేటా వెల్లడి

న్యూఢిల్లీ: ఉద్యమాల వేదిక ఢిల్లీలోని జంతర్ మంతర్..ప్రభుత్వ విధానాలపై విపక్షాల ఆందోళనలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, విద్యార్థులు తమ నిరసనలను ఇక్కడి నుంచే ప్రభుత్వాలకు వివిధ రూపాల్లో తెలియజేస్తాయి. అయితే, 2022లో జంతర్‌మంతర్‌లో ఉద్యమాలు, ధర్నాలు 23 శాతం పెరిగినట్లు పోలీసులు గురువారం తెలిపారు. కోవిడ్‌పై ఆంక్షలు ఎత్తివేయడంతో ధర్నాలు పెరిగాయని చెప్పుకొచ్చారు. పీటీఐకి అందిన అధికారిక డేటా ప్రకారం గతేడాది పోలీసుల అనుమతితో జంతర్ మంతర్ వద్ద 661 ప్రదర్శనలు, 189 ధర్నాలు జరిగాయి. 2021లో కేవలం 560 ప్రదర్శనలు, 129 ధర్నాలు మాత్రమే జరిగాయి. 2021లో కోవిడ్ రెండో విడత విజృంభించిన ఏప్రిల్-మే మధ్యకాలంలో ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నిరసనలు సహా అన్ని రకాల సమావేశాలపై నిషేధం ఉంది. 2021తో పోలిస్తే గతేడాది జంతర్‌మంతర్ వద్ద ప్రదర్శనలు, ధర్నాలు 23.36శాతం పెరిగినట్లు డేటా వెల్లడిస్తోంది. 2022లో జంతర్ మంతర్ వద్ద జరిగిన రెండు అతిపెద్ద నిరసనల్లో భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధరపై కేంద్రానికి వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమాలే.ధర్నాలు, ప్రదర్శనలు ప్రజా నిరసనల రూపంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ధర్నాకు, ప్రదర్శనకు మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ ఏదైనా ఓ సమస్యపై చైతన్యవంతం చేయడానికి ప్రజలను పెద్దఎత్తున సమీకరించడం కాగా, బహిరంగ ప్రదేశాల్లో ఒకచోట కూర్చోవడాన్ని ధర్నా అంటారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. సహజంగా ధర్నాలు ప్రశాంతంగా జరుగుతాయి. ప్రదర్శనలు మాత్రం ఉద్రిక్తతకు దారితీస్తాయి. సాధారణంగా ప్రదర్శన లేదా ధర్నా నిర్వహించడానికి సంబంధిత సంఘం లేదా పార్టీ అనుమతి తీసుకుంటాయి. ఒకవేళ అనుమతి లేకుండా గుమికూడితే...ఆ ఆందోళనలు కొంత వరకు ఉద్రిక్తతకు దారితీస్తాయని అధికారి తెలిపారు. ఆందోళనల సమయంలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, ఆందోళనకారులను అదుపు చేయడం కష్టసాధ్యంగా మారుతుందని చెప్పారు. ఆందోళనకారులు ఉల్లంఘనలకు పాల్పడకుండా చూడటం, శాంతిభద్రతలు నిర్వహించడం తప్పనిసరని, ఒకే అంశంపై భిన్నసిద్ధాంతాలు గల రెండు వర్గాలు గుమికూడితే...ఆ రెండు వర్గాలు ఎదురుపడకుండా చూడటం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆందోళనకారులు విద్వేష ప్రసంగాలు చేయకుండా నిలువరించడం కత్తిమీద సాములాంటిదన్నారు.

ఆరోగ్య కార్యకర్తలకు ప్రధాని అభినందన

న్యూఢిల్లీ: భారతదేశాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఆరోగ్య కార్యకర్తలందించిన సేవలు అనిర్వచనీయమని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. జాతీయ టీకా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రధాని ఈ మేరకు ట్వీట్ చేశారు. ఆరోగ్యకర దేశాన్ని నిర్మించాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు. 'భారతదేశాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి అందిస్తున్న సేవలకు గాను మన ఆరోగ్య కార్యకర్తలందరికీ అభినందనలు. జాతీయ టీకా దినోత్సవం రోజున మనం ప్రజలకు టీకాలు వేయడంలో భారతదేశం సాధించిన పురోగతిని గుర్తుచేసుకుందాం... ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడంలో మన నిబద్ధతను పునరుద్ఘాటించుదాం' అన్నారు.

బాణాసంచా తయారీ యూనిట్‌లో పేలుడు

ధర్మపురి: బాణాసంచా తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించి ఇద్దరు మహిళలు మృతి చెందగా, ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తమిళనాడు ధర్మపురి జిల్లాలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పెన్నాగరం సమీపంలోని నాగదాసంపట్టి గ్రామంలోని యూనిట్‌లో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి యూనిట్ మొత్తం ధ్వంసమైంది. ఇందులో పనిచేస్తున్న సేలం జిల్లా మేచేరికి చెందిన బి.పళనియమ్మాళ్ (50), నాగదాసంపట్టికి చెందిన మునియమ్మాళ్ (50) అనే ఇద్దరు మహిళా కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన శివలింగం (52)ని ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కాగా ప్రమాదంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలు, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. 'కార్మికుల మృతి వార్త నన్ను కలిచివేసింది. గాయపడ్డ శివలింగానికి సరైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

మోదీ సర్కారు ఆయుధం సీబీఐ, ఈడీ

సీపీఎం విమర్శ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకులపై కేంద్ర సంస్థలను మోదీ సర్కారు ఓ ఆయుధంగా వాడుకుంటున్నదని సీపీఎం విమర్శించింది. ఇటీవల కాలంలో విపక్ష నేతలపై సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో వేధించడం, జైలుకు పంపడం వంటి ఘటనలను ప్రస్తావించింది.

కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేయడంపై సీపీఎం వారపత్రిక పీపుల్స్ డెమోక్రసీ తన సంపాదకీయంలో తూర్పారపట్టింది. గడచిన కొన్ని రోజులుగా ప్రతిపక్ష నేతలపై సీబీఐ, ఈడీ జరిపిన దాడుల జాబితాను వెల్లడించింది. ప్రతిపక్ష నేతలపై సీబీఐ దర్యాప్తు చేయడం, కేసులు నమోదు చేయడం, మనీలాండరింగ్ పేరుతో ఈడీని రంగంలోకి దించడం నిత్యకృత్యమైందని విమర్శించింది. 'మనీలాండరింగ్ నియంత్రణాచట్టం(పీఎంఎల్‌ఏ) నిబంధనలు అనాగరికమైనవి. నిందితుల పేరుతో అరెస్టు, గాలింపు, ఆస్తుల స్వాధీనం వంటి హక్కులు ఈడీకి కట్టబెట్టారు. బెయిల్ రావడమే కష్టసాధ్యంగా మార్చి...జైలుకు పంపడం సర్వసాధారణమైంది' అని పేర్కొంది. కేంద్ర సంస్థలను ప్రత్యేకించి ఈడీని మోదీ సర్కారు విపక్షాలపై ఆయుధంగా వాడుకుంటుంది. రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ, సీబీఐలను సాధనంగా వినియోగించుకుంటుంది' అని సంపాదకీయం తెలిపింది. రెండు ప్రయోజనాల కోసం కేంద్ర సంస్థలు పనిచేస్తున్నాయని వివరించింది. ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నేతలపై కేసులు బనాయించి జైలుకు పంపడం, బెయిల్ రాకుండా, విచారణ జరపకుండా సుదీర్ఘకాలం జైలుకే పరిమితం చేయడం ద్వారా ప్రతిపక్షాలను అణచివేయడం అందులో ఒకటి కాగా...సీబీఐ, ఈడీల ద్వారా భయపెట్టి బీజేపీలో చేర్చుకోవడం ద్వారా ప్రతిపక్ష పార్టీల్లో చీలికలు తీసుకురావడం మరొకటని వివరించింది. ఈ ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉన్న కారణంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, సీఎం కె.చంద్రశేఖరరావు కుమార్తె కవితపై చర్యలు దిగినట్లు ఆరోపించింది.

తెలంగాణలో విజయం సాధించాలన్న ఏకైక లక్ష్యంతోనే ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితపై చర్యలకు ఉపక్రమించినట్లు అభిప్రాయపడింది. ఈడీ దాఖలు చేసిన 95 శాతం కేసులు ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులపైనేనని తెలిపింది.

ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో ఉద్యోగాలిప్పిస్తామని మోసం

తొమ్మిదిమంది సభ్యుల ముఠా అరెస్టు

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వందమందికి పైగా నిరుద్యోగ యువకులను మోసగించిన తొమ్మిది మంది సభ్యుల ముఠాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిని మన్వేంద్ర సింగ్ రజావత్ (23), వినీత్ సింగ్ భదౌరియా (28), అజీత్ సింగ్ రాజావత్ (22), దీపక్ సింగ్ చౌహాన్ (28), సురేంద్ర ప్రతాప్ సింగ్ (32), రజత్ సెంగార్ (25), అభయ్ యాదవ్ (22), సత్యం సింగ్ (23), శివమ్ సింగ్ రాజావత్ (22)గా గుర్తించారు. కాగా సులభంగా డబ్బు సంపాదించవచ్చంటూ ముఠాలో చేరేలా ఇతరులను ప్రలోభపెట్టిన సహ నిందితులు అమీర్, శివమ్‌లను పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. నిందితులు నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో మానవ వనరుల అధికారులుగా నటించి టెలీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ మోసగాళ్ల ముఠా నోయిడా, ఉత్తమ్ నగర్, ద్వారకా ,నవాడతో సహా వివిధ ప్రాంతాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

వీరు ఆన్‌లైన్‌లో ఉద్యోగాల అన్వేషణ వెబ్‌సైట్ల ద్వారా ఉద్యోగార్థుల బయోడేటాను సేకరించారు. వారి నమ్మించేందుకు బాధితులకు నకిలీ జాబ్ ఆఫర్ లెటర్‌లు, ఐడీ కార్డులు, ఇతర పత్రాలను ఆన్‌లైన్‌లో పంపారని పోలీసులు తెలిపారు. ఉద్యోగం పేరుతో మోసపోయిన బురారీ నివాసి ఫిర్యాదు చేయడంతో మోసగాళ్ల ముఠా గుట్టురట్టయినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్) సాగర్ సింగ్ కల్సి తెలిపారు. వెబ్‌సైట్‌లో తన రెజ్యూమ్‌ను పోస్టు చేసిన రెండురోజులకే దానిని ఉద్యోగావకాశానికి ఎంపిక చేసినట్లు సమాచారం అందించారు. ఆ తర్వాత అతను మానవ వనరుల మేనేజర్‌గా ఉన్న మరొక వ్యక్తితో మాట్లాడేలా చేయబడ్డాడు. తర్వాత ఫోన్‌లో ఇంటర్వ్యూ చేశారు. ఆ తర్వాత శాలరీ ఎక్కౌంట్ యాక్టివేషన్, పాస్‌పోర్ట్ తదితర అవసరాల కోసం ముందస్తుగా రూ.1,37,500 బ్యాంకు ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుడు నిందితుడు అందించిన బ్యాంకు ఖాతాలో ఆ మొత్తాన్ని జమ చేసినట్లు తెలిపారు. కొన్నిరోజులు గడిచాక ఫిర్యాదుదారు ఉద్యోగం కోసం పట్టుబట్టడంతో, కొన్ని అంతర్గత అత్యవసర పరిస్థితుల కారణంగా, కంపెనీ నియామకాన్ని నిలిపివేసిందని తెలిపారు. ఫిర్యాదుదారు తన డబ్బును తిరిగి ఇవ్వమని కోరగా, నిందితుడు తన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని వివరించారు.

'గవర్నర్ ఆఫ్ ది ఇయర్' శక్తికాంత దాస్

న్యూఢిల్లీ: భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్‌ను 'గవర్నర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం వరించింది. అంతర్జాతీయ పరిశోధన జర్నల్ 'సెంట్రల్ బ్యాంకింగ్' ఆయనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారంతో గౌరవించింది. ఆపదసమయంలో ఆర్బీఐ గవర్నర్‌గా అందించిన సేవలకుగాను శక్తికాంత దాస్‌ను గవర్నర్ ఆఫ్ ది ఇయర్-2023గా ఎంపిక చేసినట్లు ప్రకటించింది. నాన్ బ్యాంకింగ్ సంస్థ కుప్పకూలి... కొవిడ్-19 దశలవారీగా విజృంభించి, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం క్రమంలో ద్రవ్యోల్బణం ఒత్తిళ్లను అధిగమించడంలో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ సమర్థ సేవలు అందించినట్లు సెంట్రల్ బ్యాంకింగ్ కొనియాడింది. ఆయన నాయకత్వంలోనే కఠిన సంస్కరణలు తీసుకురావడంతో పాటు, వినూత్న చెల్లింపు వ్యవస్థలు భారత్‌కు పరిచయమైనట్లు తెలిపింది. ఈ పురస్కారం అందుకున్న రెండో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ నిలిచారు. అంతకుముందు 2015లో రఘురామ్ రాజన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

పొరుగుదేశాలతో స్నేహ సంబంధాలను కొనసాగిస్తాం: మురళీధరన్

న్యూఢిల్లీ: దక్షిణాసియాలోని ఓడరేవులు, రహదారులు, విమానాశ్రయాలతో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు చైనా నిధులు సమకూరుస్తున్నట్లు తమకు తెలుసునని కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. రాజ్యసభలో ఓ ప్రశ్నకు విదేశీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి వి.మురళీధరన్ సమాధనమిస్తూ... భారతదేశం తన తన పొరుగు దేశాలతో స్నేహపూర్వక, పరస్పర ప్రయోజనకర సంబంధాలను పెంపొందించుకోవడానికి కట్టుబడి ఉందన్నారు. అయితే దేశ భద్రతపై ప్రభావం చూపే అన్ని పరిణామాలపై ప్రభుత్వం నిరంతరం నిఘా ఉంచుతుందని, దేశాన్ని రక్షించడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఓడరేవులు, హైవేలు, రైల్వేలు, విమానాశ్రయాలతో సహా దక్షిణాసియాలోని దేశాలలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు చైనా నిధులు సమకూరుస్తోందని ప్రభుత్వానికి తెలుసునని మురళీధరన్ స్పష్టం చేశారు. భారత్ తన పొరుగు దేశాలకు చురుకైన ఆర్థిక భాగస్వామి అని, ఈ దేశాల్లో పెద్ద సంఖ్యలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నదని ఆయన అన్నారు. రక్షణ, భద్రతా సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సంస్కృతి వంటి విభిన్న రంగాలలో భారతదేశం తన పొరుగు దేశాలతో విస్తృత సంబంధాలను కలిగి ఉందని చెప్పారు. గత కొన్నేళ్లుగా యుఎస్, ఐయూకే, కెనడాలో భారతీయ పౌరులు మరియు భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులపై (పిఐఓలు) దాడులు జరిగాయని, ఈ దాడులు కొన్ని జాతి విద్వేషపూరితంగా కనిపిస్తున్నాయని మరో పశ్నకు సమాధానంగా మురళీధరన్ చెప్పారు. విదేశాలలో ఉన్న భారతీయుల భద్రత, శ్రేయస్సుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు.

మూడు షిఫ్టులు-పది రోజులు

- సీయూఈటీ పరీక్షలకు కసరత్తు
- జేఈఈ, నీట్‌తో విలీనంపై రెండేళ్లు ముందే ప్రకటిస్తాం
- యూజీసీ చీఫ్ కుమార్

న్యూఢిల్లీ: సీయూఈటీ-యూజీ (విశ్వవిద్యాలయాల ఉమ్మడి ప్రవేశపరీక్ష)ను ఈ ఏడాది రెండుకు బదులు మూడు షిఫ్టుల్లో, ఒకటిన్నర మాసం కాకుండా పది రోజుల్లో నిర్వహించనున్నట్లు యూజీసీ చైర్మన్ ఎం.జగదీశ్ కుమార్ తెలిపారు. జేఈఈ, నీట్ వంటి కీలకమైన ప్రవేశపరీక్షలతో సీయూఈటీ విలీనానికి కసరత్తు జరుగుతోందని, అది పూర్తి అయితే కనీసం రెండేళ్లు ముందుగానే విలీనంపై ప్రకటన వెలువడుతుందని చెప్పారు. కుమార్ బుధవారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌ఏటీ) సంయుక్తంగా సీయూఈటీ-యూజీ రెండవ ఎడిషన్‌కు సిద్ధమైనట్లు కుమార్ తెలిపారు. గతసారి పరీక్ష నిర్వహించిన సమయంలో అనేక సమస్యలు తలెత్తడం వాస్తవమేగానీ వాటన్నింటి పరిష్కరించి విద్యార్థులు సమస్యల గురించి ఆలోచించాల్సిన పనిలేకుండా చేశామని చెప్పారు. అనుకోని సమస్యలు తలెత్తితే ప్లాన్‌బీతో సిద్ధంగా ఉన్నామని, అదనంగా కంప్యూటర్లు, కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులను అక్కడకు తరలించవచ్చని, సంబంధిత షిఫ్టు పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం రాదని ఆయనన్నారు. ఈ సంవత్సరం నుంచి మూడు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తున్నామని అన్నారు. జేఈఈ, నీట్ (ఇంజినీరింగ్-మెడికల్ ప్రవేశపరీక్షలు)తో సీయూఈటీ విలీనం ప్రతిపాదనపై ప్రశ్నకు స్పందిస్తూ 'అది సాధ్యమే.. విలీనం ఎప్పుడు జరిగిన దానిపై కనీసం రెండేళ్ల ముందే ప్రకటన వెలువడుతుంది. తద్వార విద్యార్థులకు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది' అని కుమార్ అన్నారు. గతేడాది జులైలో సీయూఈటీ-యూజీ మొదటి ఎడిషన్ పరీక్షలు సమస్యల నడుమ జరిగాయి. పర్యవసానంగా అనేక కేంద్రాల్లో పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేయాల్సి వచ్చింది. ఉదయం పరీక్ష ఉందనగా రద్దు సమాచారం విద్యార్థులకు అందింది. చాలా మందిని కేంద్రాల వద్ద నుంచి తిప్పిపంపేశారు. అన్ని కేంద్ర వర్సిటీల నుంచి అండర్‌గ్రాడ్యుయేట్ ప్రవేశాల కోసం 14.9లక్షల రిజిస్ట్రేషన్లు రావడంతో దేశంలో అతిపెద్ద రెండవ ప్రవేశ పరీక్షగా సీయూఈటీ నిలిచింది. ఈ ఏడాది 11.5లక్షల రిజిస్ట్రేషన్లు రాగా డెడ్‌లైన్‌ను 30వ తేదీ వరకు పొడిగించినట్లు కుమార్ వెల్లడించారు. పరీక్ష షెడ్యూల్ పది రోజులకు నిర్ణయించామని, ఒకటిన్నర నెల కాదని చెప్పారు.

కర్ణాటక బీజేపీలో ముసలం

యడియూరప్ప కాన్వాయ్ అడ్డగింత

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ముంగిట అధికార బీజేపీలో విభేదాలు తీవ్రమయ్యాయి. చికమగుళూర్ జిల్లా మడికెరలో స్థానిక ఎమ్మెల్యే ఎంపీ కుమారస్వామికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో కుమారస్వామికి పార్టీ టికెట్ ఇవ్వవద్దని నిరసనకారులు డిమాండ్ చేశారు. మాజీ సీఎం యడ్యూరప్ప ఈ ప్రాంతంలో భారీ రోడ్‌షో నిర్వహణకు ముందు భారీ నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. విజయ్ సంకల్ప్ యాత్ర సందర్భంగా యడియూరప్ప ఈ ప్రాంతానికి రాగానే ఆయన కారును నిరసనకారులు అడ్డగించి ధర్నాకు దిగారు. పార్టీ కార్యకర్తలు తన కాన్వాయ్‌ను అడ్డగించడంతో ఆగ్రహించిన యడియూరప్ప కార్యక్రమాన్ని రద్దుచేసుకుని వెనుతిరిగారు. కార్యక్రమాన్ని అడ్డుకున్న పార్టీ కార్యకర్తలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ ఉక్కు మూసివేతకు కుట్ర

- నెలాఖరున ఢిల్లీకి వెళతాం
- పార్లమెంటరీ స్థాయీసంఘం సభ్యులు, నేతలకు వినతులిస్తాం
- పోరాట కమిటీ నేత ఆదినారాయణ వెల్లడి

విశాలాంధ్ర– విశాఖ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ ఉక్కు, బొగ్గు పార్లమెంటరీ స్థాయీసంఘం సభ్యులను, అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఈ నెలాఖరులో కలవనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ తెలిపారు. విశాఖలో గురువారం అన్ని కార్మికసంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదినారాయణ మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ఖాయిలా పరిశ్రమగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. సకాలంలో వడ్డీ చెల్లిస్తూ మంచి ట్రాక్ రికార్డు కలిగి ఉన్నా స్టీల్‌ప్లాంట్‌కు బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా కేంద్రం అడ్డుపడుతోందని మండిపడ్డారు. మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ని 14 నెలలుగా ఆపేశారని, దాన్ని తిరిగి ప్రారంభించాలంటే రూ.500 కోట్లు అవసరమని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లేలా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కి ఐరన్ ఓర్ సరిగా ఇవ్వడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఇనుప ఖనిజం ఏప్రిల్ 25 వరకు సరిపోతుందని చెప్పారు. ఉక్కు, ఎన్ఎండీసీ ఒకే మంత్రిత్వ శాఖ కింద ఉన్నా ఇనుప ఖనిజం సరఫరాలో సరైన స్పందన లేదన్నారు. 2021 జనవరి 27న స్టీల్‌ప్లాంట్‌ని 100 శాతం విక్రయిస్తామని ప్రకటించిన తర్వాత ఎటువంటి రుణ సౌకర్యం కల్పించకుండా, ముడిసరుకు కేటాయించకుండా, వడ్డీరేట్లు పెంచడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని కుంటుపరుస్తూ ఖాయిలా పరిశ్రమగా మార్చేందుకు మోదీ సర్కారు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రైవేటు స్టీల్ ప్లాంట్లు వడ్డీలు చెల్లించకపోయినా మాఫీ చేస్తున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం వివక్ష ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. 760 రోజులుగా కార్మికులు, రాష్ట్ర ప్రజలు పోరాడుతున్నా కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్ విలువను రూ.636 కోట్లుగా లెక్కకట్టి అతి తక్కువ ధరకు అమ్మడానికి చూస్తున్నారని విమర్శించారు. దేశంలో 120 మిలియన్ టన్నుల ఉక్కుఉత్పత్తి అవుతోందని, 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారని, మరో పక్క బాగా పనిచేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కోవిడ్ సమయంలో విశాఖ ఉక్కు కార్మికులు ప్రాణాలకు తెగించి ఆక్సిజన్ అందివ్వడం ద్వారా అనేక మంది ప్రాణాలు కాపాడారని చెప్పారు. విశాఖ ఉక్కు విక్రయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ముడి ఇనుము గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును పూర్తిసామర్థ్యంతో నడిపేందుకు, బ్యాటరీ ఆరు నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలకు వడ్డీలు తగ్గించాలన్నారు. ఎన్ఎండీసీ నుండి ముడి సరుకును ఉత్పత్తి ధరకే ఇప్పించాలని, కోల్ ఇండియా, రైల్వేతో మాట్లాడి నిరంతరం బొగ్గు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు సామర్థ్యాన్ని విస్తరించి మిగిలిన నిర్వాసిత కుటుంబాలకు శాశ్వత ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో భూములు పంచాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.రామచంద్రరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డీవీ రమణారెడ్డి, ఎం.వెంకటరావు, డేవిడ్, హెచ్ఎంఎస్ అప్పారావు, జేఎంఎస్ నేతలు వలసల శ్రీనివాసరావు, కోట శంకర్రావు, వై.మస్తానప్ప, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జె.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యముంటే అనుమతించాలి

మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు రాహుల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు మోదీ సర్కారు రాద్ధాంతం సృష్టిస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా తాను లండన్‌లో మాట్లాడినట్లు అభూత కల్పనలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంటులో బీజేపీ చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పడానికి తనకు మాట్లాడే అవకాశం ఇస్తారా...లేదా అనేది భారత ప్రజాస్వామ్యానికి పెద్ద పరీక్ష అని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్‌గాంధీ గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు సభ్యుడినైన తనపై నలుగురు బీజేపీ నాయకులు ఆరోపణలు చేశారని, వారి నోరు మూయించడానికిగాను మాట్లాడటానికి తనకు అవకాశం ఇవ్వాల్సి ఉందని రాహుల్ అన్నారు. అదానీ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ భయపడుతున్నారని, అందుకే బ్రిటన్‌లో తానేదో వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, ఇదంతా ప్రజల దృష్టి మళ్లించే దుర్మార్గమని వ్యాఖ్యానించారు. నలుగురు కేంద్రమంత్రులు తనకు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారని, వీటికి పార్లమెంటులోనే స్పందించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు చెప్పినట్లు రాహుల్‌గాంధీ తెలిపారు. దీనికి స్పీకర్ స్పష్టమైన సమాధానం చెప్పకుండా నవ్వి ఊరుకున్నారన్నారు. మంత్రులకు పార్లమెంటులో సమాధానం చెప్పడం తన హక్కని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో మాట్లాడేందుకు అనుమతిస్తారని తాను భావిస్తున్నానని, అయితే, ఈ విషయాన్ని కచ్చితంగా చెప్పలేమన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం సజావుగా ఉంటే పార్లమెంటులో మాట్లాడటానికి తనకు అవకాశం కల్పిస్తారని వ్యాఖ్యానించారు. 'ఎంపీగా పార్లమెంటులో సమాధానం చెప్పడం నా బాధ్యత' అని రాహుల్ అన్నారు. అదానీ గ్రూప్‌కు సంబంధించి గత పార్లమెంటు సమావేశాల్లో తాను అడిగిన ప్రశ్నలకు మోదీ ఇప్పటికీ సమాధానం చెప్పలేదని ఆయన గుర్తుచేశారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత రాహుల్ ఉదయం పార్లమెంటు హౌస్‌కు వెళ్లారు. స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్‌గాంధీ బ్రిటన్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు పార్లమెంటు ఉభయసభలను కుదిపేస్తున్నాయి. నాలుగు రోజులుగా సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతున్నట్లు రాహుల్ వ్యాఖ్యానించినట్లు బీజేపీ ఆరోపిస్తోంది. స్పీకర్‌ను కలిసిన తర్వాత రాహుల్ మీడియాతో మాట్లాడుతూ భారతదేశానికి, పార్లమెంటుకు వ్యతిరేకంగా లండన్‌లో తానేమీ మాట్లాడలేదని వివరించారు. స్పీకర్ అనుమతిస్తే తానేమి మాట్లాడానో చెబుతానన్నారు. ఒకవేళ పార్లమెంటులో మాట్లాడటానికి అనుమతివ్వకపోతే బయట చెబుతానన్నారు. రాహుల్ వెంట లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నేత అధిర్ రంజన్ చౌదరి ఉన్నారు.



సేద్యం, నీటి ప్రాజెక్టులకు అన్యాయం: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర– త్రిపురాంతకం: వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం బడ్జెట్ 2,79,279 కోట్ల రూపాయలు ఉండగా వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ.41 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రసాద్ విమర్శించారు. వ్యవసాయానికి రూ. 12 వేల కోట్లు ఏమాత్రం సరిపోవన్నారు. నీటి పారుదలరంగానికి బడ్జెట్‌లో 15శాతం కేటాయించాలని జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబుకు విన్నవించినా ప్రయోజనం లేదని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 0.58 శాతం మాత్రమే కేటాయించినట్లు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ప్రసాద్ విమర్శించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరాన్ని పట్టించుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సీపీఐ నాయకులు రామయ్య, ఖాసిం, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌పై భిన్న స్వరాలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. బడ్జెట్ మేడిపండును సూచిస్తోందని, కీలక రంగాలను విస్మరించి కేవలం నవరత్నాల అమలుకే పరిమితమైందని వివిధ రాజకీయ పార్టీల నేతలు విమర్శించారు. ఇప్పటికే లెక్కకు మించి చేసిన అప్పులు రాష్ట్రానికి పెనుముప్పుగా భావిస్తుండగా, బడ్జెట్‌లో ద్రవ్యలోటును రూ.54,587 కోట్లుగా పేర్కొనడం రాబోయే సంవత్సరంలో ఇంకా అప్పు చేస్తామని నిస్సిగ్గుగా చెప్పడమేనని రాజకీయపక్షాలు ధ్వజమెత్తాయి. బడ్జెట్‌పై వివిధ రాజకీయపార్టీల నేతల అభిప్రాయాలు...

అభివృద్ధి నిల్ –అప్పులు ఫుల్

శ్రీనివాసరావు

రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి నిల్– అప్పులు ఫుల్ అనే విధంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రైతు భరోసా సొమ్ము 13,500 నుండి 25 వేలకు పెంచాలి. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం లేదు. ఇరిగేషన్‌కు నిధులు నామమాత్రంగా కేటాయించారు. పోలవరం, వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజుల స్రవంతి, హంద్రీ నీవా పూర్తి కావటం ఈ నిధులతో అసాధ్యం. గ్రామీణ అభివృద్ధి, పట్టణ అభివృద్ధికి నిధులు తగ్గాయి, అమ్మ ఒడి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బకాయి చెల్లింపు లేదు. కార్మికులకు కనీస వేతనాల ప్రస్తావన, కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల క్రమబద్ధీకరణ, డీఎస్సీ నియామకాల గురించి ప్రస్తావించలేదు. సీపీఎస్ ప్రస్తావనలేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపడం గురించి చెప్పలేదు. ప్రజల తలసరి ఆదాయం పెరగటం కాదు... అంతకుమించి అప్పులు కూడా పెరిగాయి. ఆదాయం–అప్పుల నిష్పత్తి చూస్తే అప్పులు పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. అగ్రిగోల్డ్ బాధితులకు కేటాయింపులు చూపించలేదు.

ఉద్యోగ, కార్మికుల ప్రస్తావనేది: ఓబులేసు

ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏమాత్రం పస లేదు. ఇందులో వాపు తప్ప బలుపు లేదు. నీటి పారుదల రంగానికి కేవలం రూ.11వేల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయం. కార్మిక శాఖకు రూ.700 కోట్లు కేటాయించడం మరింత అన్యాయం. ప్రజా ఉద్యమాలను అణగదొక్కడానికి ఉపయోగించుకుంటున్న హోంశాఖకు మాత్రం రూ.8 వేల కోట్ల పైచిలుకు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఉద్యోగ, కార్మికులకు సంబంధించిన ప్రస్తావనే లేదు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత స్కీంను అమలు చేస్తామన్న హామీని విస్మరించారు. ముందురోజు సీఎం జగన్ అసెంబ్లీలో మాట్లాడుతూ పేదలతోనే నా ప్రయాణమని, అదే నా ఎకనమిక్స్, నా పాలిటిక్స్ అని, నా జీవితం పేదల ఉద్ధరణ కోసమేనని గొప్పగా కబుర్లు చెప్పారు. కానీ ఈరోజు బడ్జెట్‌లో ఆయన చెప్పిన మాటలు ఎక్కడా ప్రతిబింబించిన దాఖలాల్లేవు. బుగ్గన బడ్జెట్‌ను పెద్ద డొల్లగా పేర్కొన్నారు.

ప్రభుత్వ డొల్లతనాన్ని చూపిన బడ్జెట్: నాదెండ్ల మనోహర్

రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వ ఆర్థిక డొల్లతనాన్ని తెలియజేసిందని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. బడ్జెట్‌లో అంకెల హంగామా తప్ప మరేమీ లేదు. ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు గురించి కాకుండా ఇళ్లకు స్టిక్కర్లు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అతికించడానికి నిధులు ఇవ్వడం దారుణం. గడప గడపకు అంటూ వైసీపీ నాయకులు తిరిగారు. ఇప్పుడు ఇళ్లకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు వేసేందుకు గడప గడపకు ప్రభుత్వం అనే స్కీమ్ పెట్టి రూ.532 కోట్లు ప్రతిపాదించడం విడ్డూరం. భారీ లెక్కలు, అంచనాలు చూపించి ఆ తరువాత సవరించిన అంచనాల పేరుతో కేటాయింపుల్లో కోతలు వేస్తోంది. ప్రజలను మభ్యపెట్టేందుకే ఇలాంటి అంకెల గారడీ చేస్తున్నారని విమర్శించారు.

అంకెల గారడీ బడ్జెట్: లక్ష్మీనారాయణ



రాష్ట్ర బడ్జెట్‌లో అంకెలు ఘనంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ ఎద్దేవా చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన మాటల వాగాడంబరానికి హద్దే లేకుండా పోయింది. నాలుగు సంవత్సరాల అనుభవం నేపథ్యంలో ఈ బడ్జెట్ కేటాయింపులు అమలుకు నోచుకునే అవకాశాలు కనబడటం లేదు. ఎన్నికల సంవత్సరంలో అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే రీతిలో ఈ బడ్జెట్ రూపొందించారు. ద్రవ్యలోటు రు.54,587 కోట్లుగా పేర్కొన్నారంటే, కనిష్టంగా ఆ మేరకు రాబోయే సంవత్సరంలో ప్రభుత్వం అప్పు చేస్తుందని చెప్పకనే చెప్పింది. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. నీటి పారుదల రంగానికి రు.11,908 కోట్లు ప్రతిపాదించారు. గత కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు చేయలేదు. 2023–24లో మూలధన వ్యయం పద్దు క్రింద రు.31,061 కోట్లుగా చూపెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరేడు వేల కోట్లు కూడా మూలధన వ్యయం పద్దు క్రింద వెచ్చించలేదని స్పష్టమవుతోందన్నారు.

ఆర్ఆర్ఆర్ పాటకు ఆస్కార్ రావడం గర్వకారణం

తిరుపతి: ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఆర్ఆర్ఆర్' సినిమా గురించి ప్రపంచమంతా చర్చించుకుంటోందని ప్రముఖ కన్నడ నటుడు ఉపేంద్ర అన్నారు. ఆర్ఆర్ఆర్ అన్ని హంగులు ఉన్న సినిమా అని ప్రశంసించారు. అటువంటి సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం భారతీయ చలనచిత్ర రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. 'కబ్జా' చిత్ర దర్శకుడు చంద్రుతో కలిసి గురువారం ఆయన తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ఆర్ఆర్ఆర్' సినిమాలో నటించిన వారంతా అద్భుత నటనను ప్రదర్శించారని, సాంకేతిక పరంగా సినిమాను ఉన్నత స్థాయిలో రూపొందించారని అన్నారు. తాను నటించిన 'కబ్జా' చిత్రం విడుదల సందర్భంగా ఆశీర్వాదం కోసం శ్రీవారిని దర్శించుకున్నానని చెప్పారు. కబ్జా చిత్రం విజయవంతం కావాలని స్వామివారిని కోరుకున్నానని పేర్కొన్నారు.

డీఎస్సీ ఊసేలేదు

- ఉపాధ్యాయ నియామకాలు లేనట్టేనా?
- బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.29,690 కోట్లు
- జగనన్న అమ్మఒడికి రూ.6,500 కోట్లు
- మనబడి నాడు-నేడుకు రూ.3,500 కోట్లు
- జగనన్న విద్యా దీవెనకు రూ.2,841 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులను దగా చేసింది. 2023–24 వార్షిక బడ్జెట్‌లో పాఠశాల విద్యారంగానికి రూ.29,690 కోట్ల అంచనాతో నిధులు కేటాయించింది. డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయ నియామకాల ప్రస్తావన లేదు. వాటికి సంబంధించి పాఠశాల విద్యలో ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. జగన్ అధికారంలోకి రాకముందు తన మేనిఫెస్టోలోను, పాదయాత్రలోనూ యేటా 10 వేల పోస్టులతో జంబో డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నప్పటికీ...ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను దారుణంగా మోసగించింది. జగన్ మాట నమ్మి ఓట్లేసిన ఉపాధ్యాయ శిక్షణార్థులంతా భారీగా నష్టపోయారు. జగన్ హామీ ప్రకారం నాలుగు డీఎస్సీల ద్వారా 40 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా...ఇంతవరకు ఒక్క పోస్టూ భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులకు వయస్సు మించిపోయి... ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతున్నారు. ఈ బడ్జెట్‌లో జగన్ ప్రభుత్వం మన బడి, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి, పాఠ్యాంశ సంస్కరణలు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి (టీఎంఎఫ్), పాఠశాల నిర్వహణ నిధి (ఎస్ఎంఎఫ్), సమీకృత పాఠ్యాంశాలు, పరిపాలన సంస్కరణలు తదితర కార్యక్రమాలను, విధి విధానాలను ప్రవేశపెట్టింది. మన విద్యార్థులను ప్రపంచస్థాయిలో పోటీపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా చెప్పుకుంది. ఈ బడ్జెట్‌లో జగనన్న అమ్మఒడి పథకానికి రూ.6,500 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద 2019–20 నుంచి 44లక్షల 50వేల మంది తల్లులకు, 84 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం కలుగుతుంది. మన బడి, నాడు–నేడు కింద రూ.3,500 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని 15,715 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సురక్షిత తాగునీరు, పెద్ద, చిన్న మరమ్మతుల పనులు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుద్దీకరణ, పెయింటింగ్, ఫర్నీచర్, గ్రీన్ బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, వంటశాలలు తదితర 10 విభాగాల మౌలిక సౌకర్యాల్ని జగన్ ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. దీనికింద మొదటి, రెండవ దశలలో మొత్తం 22,344 పాఠశాలల్లో పనులు చేపట్టారు. జగనన్న విద్యా కానుకకు రూ.560 కోట్లు, జగనన్న విద్యాదీవెన పథకానికి రూ.2,841 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీతోపాటు ఉన్నత కోర్సులకు పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందించేలా జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. 2019 నుంచి ఈ పథకం కింద రూ.9,249 కోట్లు పంపిణీ చేశారు. ఉన్నత విద్య కోసం ఈ బడ్జెట్‌లో రూ.2,064 కోట్లు కేటాయించింది. మొత్తంగా విద్యారంగానికి కేటాయింపులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ...పాఠశాల విద్యలో నూతన ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై మరోసారి నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం దగా చేసింది. ఉపాధ్యాయ రంగాల సమస్యల పరిష్కారంపైనా చొరవ చూపలేదు. ఉపాధ్యాయుల పీఆర్సీ తదితర ప్రయోజనాలపైనా, సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. వాటికి తగినన్ని నిధులూ కేటాయించలేదు.

రైతుల పరిహారం ప్రస్తావనలేదు: రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతుల నష్టపరిహారం ఊసే లేదని, హంద్రీనివా నీటితో రాయలసీమలోని 106 చెరువులు నింపుతామని చెప్పినా నేటికి ఒక్క చెరువు నింపలేదనీ, డిసెంబరు 2023 నాటికి 68చెరువులు నింపుతామని చెపుతున్నారని ఇంత వరకు ప్రభుత్వం పంటకాలువలు పూర్తి చేయలేదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి నామమాత్రంగానే నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రంలో 66 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని చెబుతూనే వ్యవసాయానికి ఇంత తక్కువ బడ్జెట్ కేటాయించడమేమిటని ప్రశ్నించారు. కురువ–యాదవ– గొల్లలకు తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది 25వేల కోట్లు కేటాయించి వారికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేసిందన్నారు. దీని వలన వారు ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందన్నారు. తెలంగాణా తరహాలోనే ఏపీలో కూడా గొర్రెల యూనిట్‌లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు.

ముంబైలో నేడు తొలి వన్డే

ముంబై: భారత్–ఆస్ట్రేలియా మధ్య శుక్రవారం నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే రెండు జట్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలన్న లక్ష్యంతో అటు ఆసీస్... ఇటు టీమిండియా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. కాగా టీమిండియా తుది జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. రోహిత్ శర్మ గైర్హాజరీలో హార్దిక్‌పాండ్యా జట్టు సారథ్య బాధ్యతలను తీసుకోబోతున్నాడు. దాదాపు 7 నెలల తర్వాత జడేజా మళ్లీ తిరిగి వన్డే జట్టులోకి వచ్చాడు. ఆసీస్‌తో తొలి వన్డేకు టీమిండియా 5 మంది బ్యాట్స్‌మెన్లు, 3 ఆల్‌రౌండర్లు, ఇద్దరు ఫాస్ట్ బౌలర్లు, ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్తో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. టీమిండియా ఓపెనింగ్ బాధ్యతలు శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్... మూడో స్థానాన్ని విరాట్ కోహ్లీ, నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ బరిలోకి దిగుతారు. ఇక ఫినిషర్‌గా కేఎల్ రాహుల్‌ను ఆడించే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగానికి వస్తే... భారత జట్టులో ముగ్గురు ఆల్ రౌండర్ల పాత్రలను కెప్టెన్ హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ పోషించనున్నారు. అదే సమయంలో ఫాస్ట్ బౌలింగ్ బాధ్యత మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్‌లపై పడుతుంది. కుల్దీప్ యాదవ్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రంగంలోకి దిగే అవకాశం ఉంది.

భారత్ తుది జట్టు (అంచనా): శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్

ఆస్ట్రేలియా తుది జట్టు (అంచనా): ట్రావిస్ హెడ్, డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, మార్నస్ లబూషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, కామెరాన్ గ్రీన్, మిచెల్ మార్ష్/మార్కస్ స్టోయినిస్, అలెక్స్ కారీ, సీన్ అబాట్, ఆడమ్ జంపా, మిచెల్ స్టార్క్

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్

అక్షర్ పటేల్‌కి వైస్ కెప్టెన్సీ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా బ్యాటర్ డేవిడ్ వార్నర్, ఐపీఎల్ 2023 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. 2015 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కి కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్న డేవిడ్ వార్నర్, 2015 సీజన్‌లో ఐపీఎల్ టైటిల్ గెలిచాడు. ఆ తర్వాత డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో ఐదుసార్లు ప్లేఆఫ్స్ ఆడిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ టీమ్స్‌లో ఒకటిగా నిలిచింది. ఐపీఎల్ 2023 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కి హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ వ్యవహరించబోతున్నాడు. క్రికెట్ డైరెక్టర్‌గా సౌరవ్ గంగూలీ తిరిగి బాధ్యతలు తీసుకున్నాడు. గంగూలీ, రికీ పాంటింగ్, డేవిడ వార్నర్ త్రయం కలిసి ఢిల్లీ క్యాపిటల్స్‌ని ఎలా నడిపించబోతున్నారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.

అసిఫ్ అలీఖాన్ సంచలనం

42 బంతుల్లో సెంచరీ

క్రితిపూర్ (నేపాల్): యూఏఈ జట్టు క్రికెటర్ ఆసిఫ్ అలీ ఖాన్ సంచలన ప్రదర్శనతో దుమ్మురేపాడు. నేపాల్‌తో జరిగిన వన్డేలో 41 బంతుల్లోనే శతకం బాదేశాడు. ఈ మ్యాచ్‌లో అసిఫ్ అలీ... 42 బంతుల్లో ఏకంగా 11 సిక్సర్లు, నాలుగు ఫోర్ల సాయంతో 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తద్వారా ఐసీసీ అసోసియేట్ దేశాల క్రికెట్ చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఐసీసీ అసోసియేట్ దేశాల క్రికెట్ వరల్డ్ కప్ లీగ్ 2019–2023లో భాగంగా నేపాల్ లోని క్రితిపూర్‌లో జరిగిన వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ.. నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఆ జట్టులో ఓపెనర్, కెప్టెన్ మహ్మద్ వసీమ్ (63), అరవింద్ (94) లు రాణించారు. 175 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు వచ్చిన అసిఫ్ అలీ... నేపాల్ బౌలర్లను ఆటాడుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11 భారీ సిక్సర్లు ఉండటం గమనార్హం. అసిఫ్ వీర విజృంభణతో చివరి ఓవర్లలో యూఏఈ భారీగా పరుగులు రాబట్టింది. ఐసీసీ సభ్య దేశాలతో పాటు అసోసియేట్ దేశాలలో కూడా ఈ సెంచరీ రికార్డు. ఈ జాబితాలో సౌతాఫ్రికా విధ్వంసకర ఆటగాడు ఏబీ డివిలియర్స్... 37 బంతుల్లోనే వేగవంతమైన సెంచరీ చేశాడు. ఆ తర్వాత జాబితాలో కివీస్ ఆటగాడు కోరె అండర్సన్ (36 బంతులు), పాక్ ఆల్ రౌండర్ షాహిద్ అఫ్రిది (37 బంతుల్లో), మార్క్ బౌచర్ (44 బంతుల్లో) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.